ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

శుక్రవారం 8 ఆగస్టు 2025



అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రి నారా లోకేశ్



పట్టు, నూలు దారాలతో వివిధ సంస్కృతుల కలబోతగా నేత కళాకారులు రూపొందించిన ఆంధ్రరాష్ట్ర చిత్రపటాన్ని చేనేత కుటుంబాల తరపున సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న మంత్రి లోకేశ్



సీఎం చంద్రబాబును గజమాలతో సత్కరిస్తున్న చేనేతలు



సీఎం చంద్రబాబుకు రాఖీ కడుతున్న టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి

చేనేతకు చేయూత

నేతన్నలకు రూ.25 వేలు భరోసా

మంగళగిరి, గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): 'చేనేత కార్మికులకు చేయూత అందిస్తాం. ఏటా నేతన్న భరోసా కింద రూ.25 వేలు ఇచ్చే బాధ్యత నాది. రాజధాని అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తాం. ప్రతి కుటుంబానికి నెలకు రూ.15 వేలు విద్యుత్ భారం తగ్గేలా నెలకు 200 యూనిట్ల కరెంటును ఉచితంగా ఇస్తాం. చేనేత కార్మికులకు ఎంత ఇచ్చినా అది తక్కువే. చేనేత ఉత్పత్తులపై వేసే జీఎస్టీని 5 శాతం రాష్ట్ర ప్రభుత్వం తరఫున రీయింబర్స్ చేస్తాం. త్రిఫ్ట్ ఫండును పునరుద్ధరించి 5,386 మందికి రూ.5 కోట్లు విడుదల చేస్తున్నాం..' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేనేత కార్మికులపై వరాల జల్లు కురిపించారు. పదకొండో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మంగళగిరి ఆటోనగర్‌లోని వీవర్‌శాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీవర్‌శాలలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో చేనేత వస్త్ర ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ నైపుణ్యం, సృజనాత్మకతల కలబోత చేనేత అన్నారు. 1905లో ఆగస్టు 7న మొదలైన స్వదేశీ ఉద్యమ స్ఫూర్తి తో జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నా మని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో చేనేత రంగం కుదేలైపోయిందన్నారు. ఆప్కో ద్వారా

(మిగతా 6లో)

చేనేత వైభవానికి పుట్టినిల్లు

భారతీయ శక్తికి, సంస్కృతికి, సంప్రదాయానికి శతాబ్దాల క్రితమే ప్రపంచ వ్యాప్తంగా మన చేనేత ఖ్యాతి తెచ్చింది. అటు నైపుణ్యం, ఇటు సృజనాత్మక శక్తి కలబోతే చేనేత. అందులో మన తెలుగు నేల చేనేత వైభవానికి పుట్టినిల్లు. నాగరికతకు మూలం నేతన్న. హరప్పా నాగరికత నుంచి చేనేత అభివృద్ధి చెందింది. కాకతీయుల కాలంలో నాణేలపైన నేతన్నల ముద్ర ఉండేది. బ్రిటీషు వారు చేనేత వస్త్రాలను ఇక్కడి నుంచి కొనుగోలు చేసి ఇతర దేశాలలో విక్రయించుకున్నారు.



- నైపుణ్య శిక్షణ.. ఉత్పత్తుల మార్కెటింగ్
- రాజధానిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు
- చేనేత దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వరాలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్, చిత్రంలో సీఎం చంద్రబాబు

చేనేతలు.. నా కుటుంబసభ్యులు

మంత్రి నారా లోకేశ్

'2019 ఎన్నికల్లో 5300 ఓట్ల తేడాతో ఓడిపోగా దాని పక్కన ఓ సున్నా కలుపుకుని 53 వేల ఓట్ల ఆధిక్యంతో గెలిపించాలని మంగళగిరి ఓటర్లను 2024 ఎన్నికల్లో అభ్యర్థించాను అయితే ఏకంగా 91,413 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలిపించిన విషయాన్ని మరువలేను. అందుకే ఇక్కడి చేనేత సోదరులను తన కుటుంబసభ్యులుగా భావించి వారి సంక్షేమం శ్రేయస్సుకోసం అహర్నిశలు శ్రమిస్తున్నాను..' అని స్థానిక ఎమ్మెల్యే మంత్రి లోకేశ్ తెలిపారు. అంచనాలకు మించి అందించిన మెజారిటీతో వచ్చిన బలంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లతో పోరాడి మరీ మంగళగిరిలో 200కు పైగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. మంగళగిరిలో దశాబ్దాల నాటి నివేశన పట్టాల సమస్యను కేబినేట్‌లో పెట్టి పరిష్కరించడంతో పాటు మొత్తం రాష్ట్రానికి కూడా దానినే దిక్సూచిగా మలిచామన్నారు. మొదటి విడతలో రూ.వేయి కోట్ల భూమిపై 3 వేల కుటుంబాలకు హక్కులను కల్పిస్తూ వస్త్రాలు పెట్టి పట్టాల పంపిణీని అవినీతిరహితంగా పారదర్శకంగా నిర్వహించామని చెప్పడానికి తానెంతో గర్విస్తున్నానన్నారు. ఇలా ఎన్నో కార్యక్రమాలను తాను చేయగలుగుతున్నానంటే తనపైన, తమ కుటుంబంపైన మంగళగిరి ప్రజలు చూపిన ప్రేమాభిమానాలే కారణన్నారు. మంగళగిరికి చెందిన పద్మశాలీ నాయకులకు రాష్ట్రస్థాయి గుర్తింపునిచ్చేలా వారికి ఉన్నత పదవులనిచ్చి గౌరవించామన్నారు. గతంలో తాను ఓటమిపాలై ప్రతిపక్షంలో ఉన్నా మంగళగిరిలో చేనేతల సంక్షేమం కోసం 26 రకాల పథకాలను సొంత ఖర్చులతో నిర్వహించానని గుర్తుచేశారు. మంగళగిరిలో వీవర్‌శాలను ఏర్పాటు చేయించి డిజైన్లు, లేటెస్ట్ మగ్గాలను చేనేత కళాకారులకు అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో చేనేత సలహాదారు సుచిత్ర ఎల్లా, మండలి చీఫ్‌విప్ పంచుమర్తి అనూరాధ, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక చేనేత



మాట్లాడుతున్న మంత్రి సవిత, చిత్రంలో మంత్రి బాల వీరాంజనేయస్వామి

- టీడీపీ ఆవిర్భావం నుంచి నేతన్నల అభ్యున్నతికి కృషి
- సూర్యలంక, వాడరేవు తీరాల్లో చేనేతలకు ప్రత్యేక స్టాల్స్
- చీరాల జాతీయ చేనేత దినోత్సవంలో మంత్రి సవిత

చీరాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): భారతీయ సాంస్కృతిక వారసత్వానికి చేనేత ప్రతీక అని రాష్ట్ర జౌళిశాఖ మంత్రి సవిత తెలిపారు. చీరాల మండలం జాండ్రపేటలో ఎమ్మెల్యే కొండయ్య అధ్యక్షతన గురువారం జాతీయ చేనేత దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో మెతుకులు లెక్కబెట్టుకునే దుస్థితిలో నేతన్నల బతుకులు దయనీయంగా మారాయన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి నేతన్నల అభ్యున్నతికి కృషి చేసిందన్నారు. అప్పట్లో ఎన్టీఆర్, ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ నేతన్నల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం సాగిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం అధికారం చేపట్టాక చిరిగిన బట్టతో పట్టుబట్టలు నేస్తున్న చేనేత బిడ్డల బాధలు గుర్తించి కుప్పడంతో జాతీయ స్థాయికి చేర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదని చెప్పారు. బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, కొండయ్య కృషితో సూర్యలంక, వాడరేవు తీర ప్రాంతాల్లో పర్యాటకుల అవగాహన కోసం ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చేనేతల ఇంటి నిర్మాణాలకు ప్రత్యేక రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఉగ్ర నరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, బుడా చైర్మన్ రాజశేఖర్‌బాబు, హ్యాండ్‌లూమ్ చైర్మన్ సజ్జా హేమలత, ఏఎంసీ చైర్మన్ జనార్ధనరావు, ఏడీ రఘునందన్, తెన్నేటి శిరీష, సిద్ధి బుచ్చేశ్వరరావు పాల్గొన్నారు.

బస్సుల్లో పెరగనున్న.. స్త్రీ శక్తి మేరకు ఏర్పాట్లు

- మహిళల ఉచిత ప్రయాణానికి ఆర్టీసీ సమాయత్తం
- పల్లెవెలుగు బస్సుల్లో ప్రత్యేక సౌకర్యాలు



మిర్చి కాటా వేయగానే రైతు ఫోన్‌కి ఎస్ఎంఎస్

- మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత

6

అధికారుల అండ.. వైసీపీ నేత దందా

- ప్రభుత్వ భూములలో గ్రావెల్ తవ్వకాలు
- లారీ రూ. 5వేల చొప్పున విక్రయం
- పట్టించుకోని అధికారులు

బల్లికురవ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు గ్రామ పరిధిలో ఉన్న ఎర్రకొండ వద్ద గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కూకట్లపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నేత ఒకరు ప్రభుత్వ భూమిలో యంత్రాలను ఏర్పాటు చేసి మరీ లారీలలో గ్రావెల్ తరలిస్తున్నారు. తన సొంత పొలం పేరుతో, ఇతర ప్రాంతాలకు లారీ గ్రావెల్ రూ. 5000 లకు విక్రయిస్తున్నట్లు సమాచారం. అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తున్నా, రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఫారెస్టు భూముల్లో కంద కాలు పెడుతున్నారు. దీని వలన భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అలానే బాలయ్య కుంటలో ఉన్న మట్టిని కూడా కొందరు తవ్వకాలు చేస్తున్నారని ఇప్పుడు కుంట గోతుల మయం అయిందని వర్షాలు కురిస్తే పంట పొలాలకు వెళ్లే పశువులు ప్రమాదాల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని రైతులు వాపోతున్నారు. దీనిపై వెంటనే చర్యలు చేపట్టాలని ఎస్ఎల్ గుడిపాడు గ్రామ రైతులు కోరుతున్నారు.



ఎర్రకొండ వద్ద గ్రావెల్‌ను లారీలలో పోస్తున్న యంత్రం

విచారించి చర్యలు చేపడతాం : తహసీల్దార్ రవినాయక్

ఎస్ఎల్ గుడిపాడు గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమంగా గ్రావెల్ మట్టి తవ్వకాలు చేపడుతున్న విషయాన్ని తహసీల్ధార్ రవినాయక్ దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకు వెళ్లగా వెంటనే విచారణ జరిపి గ్రావెల్ తవ్వకాలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లాకు.. జ్వరమొచ్చింది



పర్చూరు మండల పరిధిలోని ఉప్పుటూరులో అధ్వాన్నంగా ఉన్న డ్రైనేజీ

విస్తరిస్తున్న విష జ్వరాలు

- అక్కడక్కడ బయట పడుతున్న డెంగీ లక్షణాలు
- ఇప్పటికే ఒకరు మృతి.... 8 మందికి పాజిటివ్
- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం



నిజాంపట్నం : ముత్తుపల్లిలో పారిశుధ్య కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

జిల్లా తీర ప్రాంతంలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. నగరం మండ లంలోని ఈదుపల్లి గ్రామం లో డెంగీ లక్షణాలతో నాలుగు రోజుల క్రితం ఓ మహిళ మరణించిన సంగతి తెలిసిందే. గ్రామం మొత్తానికి పరీక్షలు నిర్వహించి పరిస్థితిని నియంత్రణలోకి తెచ్చారు. తాజాగా చెరుకుపల్లి, వేటపాలెం, నిజాంపట్నం మండలాల పరిధిలో కూడా డెంగీ లక్షణాలతో బాధితులు ఆసుపత్రుల్లో చేరడం వైరల్ జ్వరాల వ్యాప్తి వేగంగా జరుగుతున్నట్లు యంత్రాంగం గుర్తించింది. దాదాపు 200 ర్యాపిడ్ టెస్టులు చేస్తే 8 మం దికి డెంగీ పాజి టివ్‌గా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇవి ర్యాపిడ్ ద్వారా నిర్ధారితమైనవని, కచ్చితమైన ఫలితం కోసం శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపా మని రిపోర్టులు రావాల్సి ఉందని యంత్రాంగం చెబుతోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో ర్యాండమ్‌గా డెంగీ ర్యాపిడ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ఇదే కాకుండా ఇంటింటి జ్వర సర్వేకు కూడా కలెక్టర్ ఆదేశించారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) నగరం మండలం ఈదుపల్లిలో డెంగీ ఆనవాళ్లు కనబడగానే సమీక్ష చేపట్టిన కలెక్టర్ వెంకటమురళి ఆ గ్రామ పంచాయతీ సెక్రటరిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఆర్ఎంపీలు కేవలం ప్రాథమిక వైద్యమే అందించాలని, రోగులను ఇన్‌పేషంట్స్‌గా చేర్చుకొని వైద్యం అందిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కూడా అధికారులు హెచ్చరించారు. ప్రధాన రహదారి పక్కన చెత్తనిల్వలు కనబడడంతో నిజాంపట్నం మండల పరిధిలోని పంచాయతీ సెక్రటరిపై గురువారం సస్పెన్షన్ వేటు వేశారు. సస్పెన్షన్, ఆకస్మిక తనిఖీలు, ఆయా విభాగాల అప్రమత్తం ఇవన్నీ కూడా గత నాలుగు రోజుల నుంచి కనబడుతున్నవే తప్ప యథావిధిగా జరగాల్సిన ప్రక్రియలో వ్యవస్థలు ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నాయనే దానికి సమాధానం చెప్పాల్సి ఉంది. అత్యంత కీలకమైన

(మిగతా 6లో)

అధికారులపై కలెక్టర్ ఆగ్రహం



నగరం ప్రభుత్వ వైద్యశాలలో విషజ్వరాల బారిన పడిన బాధితురాలిని పరామర్శిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

రేపల్లె, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):తీరప్రాంతంలోని గ్రామాల్లో జ్వరబాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని విషజ్వరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని బాపట్లజిల్లా కలెక్టర్ వెంకటమురళి అన్నారు. గురువారం నియోజకవర్గంలోని నిజాంపట్నంమండలం ముత్తుపల్లి, నగరం, చిన్నమట్లపూడి, చెరుకుపల్లి గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. గ్రామాల్లో అపరిశుభ్రవాతావరణం ఉన్న ప్రాంతాల్లో దగ్గర ఉండి పారిశుద్ధ్య కార్మికుల చేత శుభ్రం చేయించటంతో పాటు మురుగుకాల్వల్లో నిల్వఉన్న నీటిపై దోమలనివారణ మందు చల్లించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విషజ్వరాలు మూడుమండలాల్లో

(మిగతా 6లో)



రేపల్లెలో 53 ఏళ్ల క్రితం నిర్మించిన బాలాజీపిక్చర్‌ప్యాలెస్

స్వర్ణ తెర

యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న సినీ థియేటర్లు

8

తెలుగు సినిమా స్వర్ణయుగాన్ని చూసిన వెండి తెరలు. చిత్ర ప్రదర్శనలో బ్లాక్ అండ్ వైట్ నుంచి.. అత్యాధునికి సాంకేతికత చూసిన థియేటర్లు. రీల్ ప్రొజెక్టర్..డాల్బీ అట్మాస్ వరకు ఆధునిక హంగులు అద్దుకుని కొనసాగుతున్న మహాళ్లు..పిక్చర్ ప్యాలెస్‌లు.. టాకీస్‌లు.. పైరసీలను, ఓటీటీ ప్లాట్‌ఫాంలను.. తట్టుకుని నేటికీ సింగిల్‌గా నిలబడిన సినిమా హాళ్లు. స్వర్ణోత్సవాలు(50 ఏళ్లు..) పూర్తి చేసుకుని శతమానం భవతి అంటూ సినీ ప్రియులను అలరిస్తున్న.. చరిత్రకు ఆనవాళ్లు.. ఎన్నో జ్ఞాపకాలు. ఓల్డ్ ఈజ్ గోల్డ్ థియేటర్లపై ప్రత్యేక కథనం.

-ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

- తెలుగు చిత్ర పరిశ్రమ గమనానికి ఆనవాళ్లు
- శతమానం భవతి అంటూ.. ఆధునిక హంగులు
- ఏన్నో ఒడుదుడుకులు ఎదుర్కొని సింగిల్‌గా నిలబడిన థియేటర్లు

చేనేతకు.. చేయూత

(5వ పేజీ తరువాయి)

కొనుగోళ్లు ఆపేశారని, ముడి సరుకులపై సబ్సిడీని నిలిపివేశారన్నారు. తాము వాటన్నింటినీ పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. చేనేత కార్మికుల ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ ఏడాది చేనేత పరిశ్రమ రూ.1,375 కోట్ల టర్నోవర్ సాధించిందని, చేనేతల ఆదాయం 30 శాతం పెరిగిందన్నారు. అయితే అది సరిపోదని ఆధునిక మార్కెట్‌ను సొంతం చేసుకునేలా నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలన్నారు. వినూత్న రీతుల్లో ఉత్పత్తులు తయారు చేయడం, మార్కెట్ సదుపాయాన్ని కల్పించడంపై చేనేత సలహాదారుగా నియమితులైన పారిశ్రామికవేత్త సుచిత్ర ఎల్లా సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. లోకేశ్ నేతృత్వంలో నిర్వహిస్తున్న మంగళగిరిలో 'వీవర్‌శాల' ప్రయోగాత్మక నమూనా అన్నారు. టాటా, బిర్లా వంటి ప్రముఖ సంస్థలతో అనుసంధానం చేసుకుని చేనేత మార్కెట్ అవకాశాలను పెంచుకునే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే, రాష్ట్రమంతటా అమలు చేస్తామన్నారు. వన్ ప్రాజెక్ట్ వన్ డిస్ట్రిక్ట్ పథకంలో రాష్ట్రానికి తొమ్మిది అవార్డులు వస్తే అందులో 3 అవార్డులు చేనేతకే రావడం చేనేతకు దక్కిన అరుదైన గౌరవమన్నారు. అలాంటి చేనేతను సంరక్షించడమే తమ కర్తవ్యంగా భావిస్తున్నామని తెలిపారు. చేనేత వస్త్ర ఉత్పత్తులను ఈ కామర్స్ పద్ధతిలో ఓఎన్‌డీసీ ద్వారా అందరికీ అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ఇప్పటి వరకు 2వేల రకాల చేనేత ఉత్పత్తులు ఓఎన్‌డీసీ రిజిస్టర్ అయ్యాయని చెప్పారు. మంత్రి లోకేశ్ కోరినవిధంగా మంగళగిరిలో ప్రగడ కోటయ్య పార్కును ఏర్పాటు చేసి, అక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన జయంతిని అధికారికంగా నిర్వహిస్తామన్నారు. వెంకటగిరిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ సంస్థకు ఆయన పేర నామకరణం చేశామన్నారు. రాష్ట్రంలోని 93 వేల చేనేత కుటుంబాల సంక్షేమానికి యాక్షన్‌ప్లాన్ తయారుచేసి దానిని త్రికరణశుద్ధిగా అమలుచేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

అన్నింటా ఒక అడుగు ముందున్న లోకేశ్..

మంగళగిరి నియోజకవర్గంలో 200 అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహణతోపాటు, 2 వేల పనులు పూర్తి చేసిన లోకేశ్ అందరికంటే ఒక అడుగు ముందున్నారని సీఎం కొనియాడారు. 5 వేల ఓట్లతో ఓడిన చోటే.. తిరిగి 91 వేల ఓట్లతో గెలిచారన్నారు. తనను గెలిపించిన ప్రజల జీవితాల మెరుగుదలకు లోకేశ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాష్ట్రంలో మంగళగిరిని నెంబర్ వన్‌గా చేయాలన్న ఆయన సంకల్పం కచ్చితంగా నెరవేరుతుందన్నారు.

జిల్లాకు.. జ్వరమొచ్చింది

(5వ పేజీ తరువాయి)

ప్రజారోగ్యం విషయంలో తూతూ మంత్రంగా వ్యవహరించడం సరికాదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

వర్షాకాలం మొదలైంది...

ఈ సీజన్‌లో అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇప్పుడు వెలుగు చూస్తున్న డెంగీ జ్వరాలు కూడా సీజన్ ఆరంభం ఫలితమే. వీటిని ఆదిలోనే కట్టడి చేయాలంటే గ్రామాలలో పారిశుధ్యం మెరుగుదలపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇంటిఇంటికి తిరిగి చెత్త సేకరణ, తాగునీటి విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. వీటికి తోడు మలేరియా నియంత్రణా విభాగం కూడా దోమల నివారణ చర్యలపై కార్యాచరణ రూపొందించుకుని ఆ దిశగా అడుగులేయాల్సి ఉంది. జనావాసాల్లో ఎక్కడా కూడా మురుగు కనబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అన్నింటికన్నా ముఖ్యంగా జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకునేలా ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సి ఉంది. గ్రామాల్లో ఫీవర్‌సర్వేని పకడ్బందీగా నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేయాలి. ఈ ప్రక్రియ అంతా కూడా యుద్ధ ప్రాతిపదికన గ్రామాల్లో జరగాలంటే ప్రభుత్వం రెండో విడత ఆర్థిక సంఘం నిధుల విడుదలకు మోక్షం కల్పించాలి. లేదంటే కేసులు నమోదైనప్పుడు హడావిడి తప్ప క్షేత్రస్థాయి ఫలితాలు చూపెట్టడంలో నిధుల కొరత సిబ్బందికి ప్రతికూలంగా మారే అవకాశాలు కనబడుతున్నాయి. జిల్లాలో ఉన్న 459 పంచాయతీల్లో దాదాపు 400 చోట్ల గడచిన మూడు నెలలుగా దోమల మందు ఫాగింగ్ చేపట్టకపోవడమే నిధుల కొరతకు ఉదాహరణగా నిలుస్తోంది. 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు నేటికీ పంచాయతీలకు జమ కాలేదు. జిల్లాలోని 459 పంచాయతీలకు గాను రూ.22 కోట్ల వరకు విడుదల కావాల్సి ఉంది. కానీ ప్రభుత్వం వైపు నుంచి కదలిక కనబడడం లేదు. గతేడాది నవంబరులో 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నిధులను ప్రభుత్వం పంచాయతీల ఖాతాలకు జమ చేయడంతో పాలక వర్గాలు కొంతమేర ఊపిరి పీల్చుకున్నాయి. మూడు నెలల క్రితమే రెండో విడత జమ కావాల్సి ఉన్నా ప్రభుత్వం తాత్సారం చేయడం వల్ల కనీస పనుల నిర్వహణకు కూడా పల్లె సీమలు నిధుల కటకట ఎదుర్కొంటున్నాయి.

మహా సభ.. ఎరుపెక్కిన వినుకొండ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


ప్రత్యేక ఆకర్షణగా దేశ నాయకుల వేషధారుల ర్యాలీ

వినుకొండటౌన్ ఆగష్టు 7 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రెండవ పల్నాడు జిల్లా మహాసభ పల్నాడు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మారుతీవర ప్రసాద్ అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు భయపడిన ప్రధాని మోదీ ఒక పిరికిపంద అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా వివిధ దేశనాయకుల వేషధారణలతో నిర్వహించిన ర్యాలీ విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విల్సన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందిపై దాడి..కేసు నమోదు

చిలకలూరిపేట, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుండయ్య తోటలోని పసుమర్రు గ్రామ పరిధిలోని 803, 807 సర్వే నంబర్లలో ఉన్న 1.20 ఎకరాల్లో 1994-95లో ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించింది. ప్రస్తుతం అక్కడి స్థితిని తెలుసుకునేందుకు వెళ్లిన.. రెవెన్యూ సిబ్బందిపై దాడి జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి కేసునమోదు అయింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు.. పసుమర్రు సర్వేయర్ విద్యాసాగర్, వీఆర్వో కె.చంద్రశేఖర్, వీఆర్ఏ ఆశీర్వాదం అక్కడకు వెళ్లి వివరాలు సేకరిస్తూ, ఫొటోలు తీస్తున్న సందర్భంలో ఈ దాడి జరిగింది. స్థానికుడైన వైసీపీ నాయకుడు చల్లా శ్రీనివాసరావు, ఇద్దరు కొడుకులు.. ఫొటోలు తీయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అసభ్య పదజాలంతో అడ్డుకొని సర్వేయర్‌ను కొట్టి, దుస్తులు చించేశారు. అడ్డుపడిన వీఆర్వోను నెట్టేశారు. అధికారుల ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వీఆర్వోలు, సర్వేయర్లు గురువారం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. తహసిల్దార్ హుస్సేన్ దాడిని తీవ్రంగా ఖండించారు. బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

(5వ పేజీ తరువాయి)

నెలకొన్నాయని ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచి దోమలనునివారించేందుకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేశామన్నారు.చెరుకుపల్లి గ్రామంలో రహదారి వెంబడి కొట్టేసిన కొబ్బరిబోండాలు అధికసంఖ్యలో కనబడటంతో అధికారులతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం ఎక్కడా లోపించకుండా ఆయా తహశీల్దార్లు, ఎంపీడీవోలు ప్రత్యక్షంగా తిరిగి చర్యలు చేపట్టాలని సూచించారు. నిజాంపట్నం మండలం ముత్తుపల్లి గ్రామం దళితవాడలో కలెక్టర్ పర్యటించారు. గ్రామంలో నమోదైన డెంగ్యూకేసు నేపథ్యంలో అధికారుల చర్యలపై ఆరాతీశారు. కాలనీలో పరిశుభ్రతను స్వయంగా పరిశీలించి అప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్మికులతో బ్లీచింగ్ దోమల నివారణ మందు స్ప్రేచేయించారు.నగరం మండలంలో ప్రధాన రహదారి ప్రక్కనే చెత్తనిల్వపై పంచాయతీ సెక్రటరీని సస్పెండ్ చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చికిత్సపొందుతున్న జ్వరబాధితులను పరిశీలించారు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి గ్రామంలో పర్యటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. విషజ్వరాలను నివారించేందుకు చర్యలు చేపట్టామని వైద్యాధికారులకు అనుమానం ప్రతి గ్రామంలో ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈకార్యక్రమంలో నిజాంపట్నం ఇన్‌చార్జ్ తహసీల్దారు శ్రీనివాసరావు, నగరంఎంపిడివో బొర్రాశ్రీను, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నాకు మాటిచ్చి.. వేరే వారికి అమ్మారు

● అడ్వాన్స్‌గా రూపాయి తీసుకోలేదు
● అందుకే వెంచర్‌లో సగం వాటా డిమాండ్ చేశా
● ఇందులో ఎమ్మెల్యే నరేంద్ర పాత్ర లేదు
● ఆయన అనుచరుడు మేడికొండూరు నరేష్


మాట్లాడుతున్న నరేష్

గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ఈ నెల 3న ప్రచురితమైన 'వామ్మో.. ఆ ఎమ్మెల్యే.. దందాలతో దడ' వార్తలో భాగంగా సొంత పార్టీ ఎమ్మెల్యేకు సైతం తప్పని తిప్పలు అనే వార్తపై అనుచరుడు మేడికొండూరు నరేష్ యదార్థ సంఘటనలను చెబుతూ గురువారం వివరణ ఇచ్చారు. మద్దాళి రవి కిరణ్‌కి చెందిన చేబ్రోలు మండలం, గ్రామంలోని 9 ఎకరాల 34 సెంట్లు మామిడి తోటను అమ్మకానికి పెట్టగా దాని గురించి తెలిసిన మధ్య వర్తి ద్వారా తాను కొనుగోలు చేసేందుకు సిద్ధపడి ఎకరం రూ.65 లక్షలు చొప్పున 75 రోజుల గడువు అడిగినట్లు తెలిపారు. దీంతో రవి కిరణ్ త్వరగా చేయించుకోవాలని, తనకు చాలా అవసరం ఉందని చెప్పగా.. గడువు 75 రోజులు పెట్టండి.. 40 రోజుల్లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోగలనని తాను రవికిరణ్‌కి చెప్పినట్లు నరేష్ పేర్కొన్నాడు. అందుకు అతను అంగీకరించాడని, రవి కిరణ్‌కి అడ్వాన్స్‌గా రూ.50 లక్షలు ఇవ్వడానికి సిద్ధం కాగా తీసుకోలేదని, రిజిస్ట్రేషన్ రోజునే మొత్తం చెల్లించండని చెప్పారని తెలిపాడు. అగ్రిమెంట్ రాసుకుందామని తాను అడగ్గా.. తాను మాట మీద నిలబడే వ్యక్తిని అంటూ.. అగ్రిమెంట్ రాయలేదని నరేష్ తెలిపాడు. తాను కొన్ని రోజుల తర్వాత రిజిస్ట్రేషన్ కోసం వారిని సంప్రదించడానికి ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయకుండా అందుబాటులోకి రాలేదని వివరించాడు. ఆ సమయంలో తాను బయట నుంచి అధిక వడ్డీలకు డబ్బులు సమకూర్చుకుని, వారిని కలిసేందుకు ప్రయత్నించామని చెప్పాడు. రవికిరణ్ ఫోన్ కూడా లిఫ్ట్ చేయకపోవడంతో మధ్యవర్తి ద్వారా మిల్లు వద్దకు వెళ్లగా.. తన మిత్రుడు తాత మరణించాడని, అక్కడ ఉండడటంతో ఫోన్ లిఫ్ట్ చేయలేదంటూ సమాధానం ఇచ్చాడని చెప్పారు. రెండు రోజుల తర్వాత కలుద్దామని చెప్పి.. వారం రోజుల తర్వాత ఫోన్ చేయగా ఆ భూమిని గళ్ళా రామచంద్రరావుకు అమ్మడానికి ఒప్పందం కుదుర్చుకున్నానని చెప్పినట్లు తెలిపారు. ఈ విధంగా చేయడం కరెక్ట్ కాదని చెప్పినా వినిపించుకోలేదని, తాను కలిసిన విషయాన్ని రవికిరణ్ గళ్ళా రామచంద్రరావుకు తెలియజేయగా ఆయన ఎమ్మెల్యే నరేంద్ర దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. తాను ఆ భూమిని కొన్న విషయాన్ని తెలపగా... ఆ భూమిని నరేష్ కొనుగోలు చేస్తున్నట్లు గతంలో తనకు చెప్పాడని నరేంద్ర చెప్పినట్లు తెలిపాడు. అతను కూడా మన పార్టీ వ్యక్తే.. రామచంద్రరావు వద్దకు పంపుతానిని.. ఇద్దరూ కలిసి మాట్లాడుకోండి అని నరేంద్ర చెప్పటం జరిగిందని వివరించారు. ఆ తరువాత ఎమ్మెల్యే నరేంద్ర తనను గళ్ళా రామచంద్రరావును కలవమని చెప్పి, పార్టీ పరంగా తమ రిలేషన్ చెడకుండా వ్యాపార పరంగా విషయం సెటిల్ చేసుకోవాలని ఆయన సూచించినట్లు చెప్పాడు. తాను తరువాత ఎమ్మెల్యే మాధవి భర్త గళ్ళా రామచంద్రరావును కలవగా అయన మాట్లాడుతూ ఈ పొలానికి మొత్తం పెట్టుబడి నువ్వు పెడితే తాను.. తన కంపెనీ పేరు మీద మార్కెటింగ్ చేస్తానని, తనకు 50 శాతం ఇస్తాను.. లేకపోతే తాను 50 శాతం పెట్టుబడి పెడితే.. 20 శాతం లాభాలలో వాటా ఇస్తాను అని చెప్పారని తెలిపారు. ఇందుకు తాను అంగీకరించలేదని చెప్పాడు. ఇద్దరం చెరిసగం పెట్టుబడి పెట్టి లాభాలు సమానంగా పంచుకుందామని రామచంద్రరావుకు చెప్పానని, అందుకు రామచంద్రరావు అంగీకరించలేదని తెలిపాడు. ఆ తరువాత తనకు తెలియకుండా భూ యజమాని ద్వారా రామచంద్రరావు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకున్నాడని చెప్పారు. తమ మధ్య నెలకొన్న ఈ వివాదాన్ని ఎమ్మెల్యే నరేంద్రకు అంటగట్టి బదనాం చేయడం తగదని నరేష్ పేర్కొన్నాడు.

ఎయిడెడ్ టీచర్లను సర్దుబాటు చేస్తాం

● డీఈఓ సీవీ రేణుక

గుంటూరు (విద్య) ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల అదనపు ఉపాధ్యాయులను సత్వరం సర్దుబాటు చేస్తామని డీఈఓ సీవీ రేణుక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన సర్దుబాటు ఎప్పుడో కథనంపై ఆమె స్పందించారు. ఎంఈఓల ద్వారా అదనపు ఉపాధ్యాయులను గుర్తించి, అవసరమైన పాఠశాలల్లో సర్దుబాటు చేస్తామన్నారు.

జాతీయ అవార్డు అందుకున్న కర్నాటి మురళి


ఢిల్లీలో కేంద్ర మంత్రి గిరిరాజు చేతుల మీదుగా అవార్డు అందుకున్న మురళీ

సత్తెనపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు కర్నాటి మురళీ గురువారం ఢిల్లీలో జరిగిన ప్రపంచ చేనేత దినోత్సవాల్లో.. కేంద్ర హ్యాండ్ లూమ్ మంత్రి గిరిరాజు సింగ్ చేతుల మీదుగా జాతీయ స్థాయిలో ప్రతిభా పురస్కార అవార్డు అందుకున్నారు. కర్నాటి మురళీ మల్టీ డైమండ్, టై అండ్ డై స్కిల్క్ చీరను తయారు చేశారు. ఈ చీర తయారీలో మురళీ ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయనను జాతీయ అవార్డుకు ఎంపిక చేసి అవార్డును, ప్రతిభా పురస్కారాన్ని ప్రధానం చేసింది. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ తాను అవార్డు అందు కోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరింతగా చేనేతలో మెళకువలు నేర్చుకుంటానన్నారు. మురళీ అవార్డు అందుకోవడం పట్ల సత్తెనపల్లి పట్టణానికి చెందిన చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

చివరి ఆకు వరకు కొంటాం..

● పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, సాంబశివరావు

కర్లపాలెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేసేందుకు గోదాములన్నీ నిండుకున్నందున.. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి చొరవతో కర్లపాలెంలోని ఎఫ్‌సీఐ గోదాములో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. కర్లపాలెంలోని ఎఫ్‌సీఐ గోదాములలో నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, ఏలూరి సాంబశివరావులు మార్క్‌ఫెడ్, గోదాముల అధికారులతో కలిసి గురువారం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సాంబశివరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల దగ్గర 30 మిలియన్‌ల పొగాకు సరుకు ఉందని, దానిని చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామన్నారు. 30 సెంటర్లలో.. పొగాకు కొనుగోలు చేస్తున్నారని ప్రతిసెంటర్ నుంచి 500 క్వింటాళ్ల పొగాకు తగ్గకుండా కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రభుత్వం ప్రాసెస్ చేసి పొగాకు విక్రయించిన ప్రతిరైతుకు త్వరలో నగదు జమ అయ్యేవిధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా రైతుల దగ్గర నుంచి పొగాకును కొనుగోలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వెల్లంపల్లి పొగాకు బోర్డు ఆధ్వర్యంలో బర్లీ కొనుగోలుకు కొంత స్థలం కేటాయించిందన్నారు. గోదాముల వద్దకొచ్చిన బర్లీ పొగాకును.. ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, నరేంద్రవర్మలు మార్క్‌ఫెడ్ అధికారులతో కలిసి పరిశీలించారు. పొగాకు రైతులు ఈఅవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాపుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, టీడీపీ నాయకులు ఏపూరి భూపతిరావు, మాడా శ్రీనివాసరావు, మునిపల్లి చిన్న, తిరుపతయ్య, పిట్ల వసంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 588.50 అడుగులు ఉంది. ఇది 307.57 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 5088 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8541 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,420 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 44,149 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 65,930 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

కొబ్బరి చిప్పల లీజుహక్కు వేలం వాయిదా

పిట్టలవానిపాలెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో గురువారం నిర్వహించాల్సిన భక్తులు సమర్పించిన కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే లీజు హక్కుకు వేలం వాయిదా పడింది. బహిరంగ వేలంలో పాల్గొనేందుకు పాటదారులు వచ్చినప్పటికీ పాటలో పాల్గొనకపోవటంతో వాయిదా పడినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. మరలా ఈవేలంను 11వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఈవో తెలియజేశారు.

గ్యాస్ రీఫిల్లింగ్ దుకాణంలో తనిఖీలు

● మూడు సిలెండర్లు స్వాధీనం

● కేసు నమోదు

కర్లపాలెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం-గణపవరం రోడ్డులో షాపింగ్ కాంప్లెక్స్ నందు గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న దుకాణంలో పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ ఫణికుమార్ సిబ్బందితో కలిసి గురువారం తనిఖీ చేశారు. గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న కాకర్లపూడి శేషంరాజుపై కేసు నమోదు చేసి మూడు సిలెండర్లను, ఒకనాబును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్యాస్ రీఫిల్లింగ్ చేయటం నేరమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూఅధికారి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్‌పై బైండోవర్

బాపట్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్‌పై బైండోవర్ చేసినట్లు పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపారు. అమర్తలూరు మండలం ఇంటూరు గ్రామానికి చెందిన వెల్లటూరి రాఘవేంద్రను గురువారం తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి 2లక్షల రూపాయలకు బైండోవర్ చేసినట్లు ఆయన చెప్పారు.

నేరాల అదుపునకు డ్రోన్ పహారా

చెరుకుపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉండటానికి సాంకేతికను జోడిస్తున్నామని ఎస్‌ఐ అనిల్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన స్టేషన్‌కు కొత్తగా వచ్చిన డ్రోన్‌ను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వైలెన్స్ కోసం సెక్యూరిటీ నిమిత్తం, సెర్చ్ అండ్ రెస్క్యూ కోసం, ట్రాకింగ్ కోసం, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోసం డ్రోన్ వాడుతున్నామని తెలిపారు. దీనివల్ల పోలీసుల పని తేలికవుతుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారికి హెచ్చరికలు జారీ చేశారు.

రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లు ఉపాధి హామీ నిధులు మంజూరు

కొల్లూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లు ఉపాధి హామీ నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ డీఈ కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. మండలంలోని కొల్లూరు ప్రధాన రహదారి నుంచి బొద్దులూరుపాడు వరకు ఉన్న పంచాయతీరాజ్ రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లు, జువ్వలపాలెంలోని సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలు, లింకు రోడ్డు నిర్మాణానికి రూ.1.60 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని డీఈ తెలిపారు. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు.

దాడిని ఖండిస్తూ వైసీపీ నాయకుల ధర్నా

బాపట్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పులివెందలలో వైసీపీ ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై టీడీపీ నాయకులు చేసిన దాడిని ఖండిస్తూ వైసీపీ నాయకులు గురువారం ధర్నా చేశారు. బాపట్ల పట్టణంలోని కొత్తబస్టాండ్ కూడలిలో జీబీసీ రోడ్డుపై మహాత్మాజ్యోతిరావుపూలే విగ్రహం ఎదుట బైఠాయించి నిరసన తెలియజేశారు. వైసీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు మాట్లాడుతూ బీసీ ఓట్లతోనే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బీసీ నాయకుడిపై ఉద్దేశపూర్వకంగా దాడి చేయటం దారుణమన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య, నియోజకవర్గ అధ్యక్షులు పీటా వేణుగోపాల్, వైసీపీ యువజనవిభాగం జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, సాయిల మురళి, పిన్నిబోయిన ప్రసాద్, తన్నీరు వెంకట్రావు, నర్రా వెంకట్రావు, పులి శ్రీను, జోగి రాజా, గోపినాద్, తదితరులు పాల్గొన్నారు.

నల్లమోతువారిపాలెంలో 23 చేతి పంపులు ఏర్పాటు

కర్లపాలెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలోని నల్లమోతువారిపాలెంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కేటాయించిన నిధులతో నల్లమోతువారిపాలెంలో 23 చేతిపంపులను ఏర్పాటు చేశామని ఎంపిటిసి సభ్యులు తాండ్ర సాంబశివరావు అన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన చేతిపంపులను ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ బాషా తదితరులు పరిశీలించి పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. చేతిపంపులకు నిధులు ఏర్పాటుకు మంజూరు చేసిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మకు ఎంపీటీసీ గ్రామప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ ఇన్‌చార్జి మునిపల్లి చిన్న, కార్తీక్ యాదవ్, షరీఫ్‌యాదవ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ద్విచక్రవాహనం ముగ్గురికి తీవ్రగాయాలు

బాపట్లరూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది.. వివరాల్లోకి వెళితే బాపట్ల మండలం మరుప్రోలువారిపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై కర్లపాలెం నుంచి బాపట్ల వైపుకు వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచిఇ ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈమేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపల్లె-నిజాంపట్నం రోడ్డుకు రూ.9.75కోట్లు మంజూరు

● ముమ్మరంగా రహదారి అభివృద్ధి పనులు

● హర్షం వ్యక్తం చేస్తున్న తీరప్రాంత ప్రజలు



రేపల్లె-నిజాంపట్నం రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

రేపల్లె, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలో దశాబ్ద కాలంగా రహదారి అభివృద్ధి పనులకు నోచుకోక నిత్యం వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతూ ఇబ్బందులు పడుతున్నారు. కూటమి అధికారంలోకి రావడంతో రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించి రేపల్లె-నిజాంపట్నం రహదారి అభివృద్ధి కోసం రూ.9.75కోట్లు నిధులు మంజూరు చేయించారు. అభివృద్ధి పనులకు కొంత జాప్యం జరిగినా.. రేపల్లె-నిజాంపట్నం రహదారి అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇసుకపల్లి నుంచి నిజాంపట్నం వెళ్లే రహదారి పనులు కొనసాగుతున్నాయి. దీంతో రేపల్లె-నిజాంపట్నం రహదారిలోని గ్రామాల ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇసుకపల్లి నుంచి సజ్జావారిపాలెం, శింకపాలెం నుంచి కూచినపూడి అడ్డరోడ్డు వరకు, బావూజీపాలెం నుంచి నిజాంపట్నం వరకు రహదారంతా గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామంటూ మంత్రి అనగాని దృష్టికి తీసుకురావటం తో ఆయన రహదారి అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకుంటున్నారు. పల్లపట్ల గ్రామంలోని కిలోమీటరు న్నర నాలుగులైన్ల సీసీ రహదారిని ఏర్పాటు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు కృషి చేయాలి

● డెంగీ కేసులు నమోదైన చోట ప్రత్యేక దృష్టి పెట్టాలి

● తాగునీరు కలుషితం కాకుండా చూడాలి : కలెక్టర్



నగరం గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులను నియంత్రించడంతోపాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై 11శాఖల అధికారులతో గురువారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్న పరిస్థితుల్లో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా నగరం, నిజాపట్నం, చెరుకుపల్లి, వేటపాలెం మండలాల్లో అధికారులంతా అప్రమత్తం కావాలన్నారు. డెంగ్యూ, విషజ్వరాలు వంటివి ప్రబలకుండా అన్ని పరిస్థితులు ఆధీనంలోకి వచ్చేవిదంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలను విస్మరిస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. డెంగీ కేసులు నమోదైన చోట అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. చెరుకుపల్లి, నగరం, వేటపాలెం మండలాల్లో 8డెంగీ కేసులు నమోదయ్యాయన్నారు. డెంగీ కేసులు పెరగకుండా అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాపిడ్‌టెస్ట్‌లు చేయాలని ఆదేశించారు. కేసులు నమోదైన ప్రాంతం నుంచి 10కిలోమీటర్ల చుట్టూ దోమల లార్వా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. నిల్వ ఉన్న నీటిలో ఆయిల్‌బాల్స్ వేయాలన్నారు. లార్వా నిర్మూలనకు గంబూషియా చేపల యూనిట్లు 100 విడుదల చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ చేయాలన్నారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులనైన ఉపేక్షించేదిలేదన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. గ్రామాలలో ఎక్కడపడితే అక్కడ చెత్త లేకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నగరంలో వైద్యసేవలు, పారిశుధ్యంపై సమీక్ష

నగరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో విస్తరిస్తున్న జ్వరాల నేపథ్యంలో కలెక్టర్ వెంకటమురళి నగరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి అందిస్తున్న వైద్యసేవలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన వైద్యసిబ్బంది ఏర్పాటు చేయాలని అత్యవసర పరిస్థితుల్లో తగిన వైద్యసేవలు కల్పించాలని ఆయన సూచించారు. వైద్యఆరోగ్యశాఖ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పూర్తి నివేదికలను అందించాలన్నారు. మండలంలోని చినమట్లపూడిలో ఫీవర్ సర్వేను నిర్వహిస్తూ ప్రజలకు వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరం శివారులోని డంపింగ్ యార్డును ఆయన పరిశీలించారు. పరిసరాల నివాసితులకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జ్వరాల నియంత్రణకు సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

బాలికలు, మహిళలకు రక్షణగా పోలీసుశాఖ

● ఎస్పీ తుషార్ డూడీ



ఎస్పీ తుషార్‌డూడీకి రాఖీ కట్టేందుకు వచ్చిన విద్యార్థినులు

బాపట్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : అమ్మాయిలు, మహిళలకు రక్షణగా ఉంటూ వారిని కంటికి రెప్పలాగా పోలీసుశాఖ కాపాడుకుంటుందని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి గురువారం భాష్యం స్కూల్ విద్యార్థినులు విచ్చేసి ఎస్పీకి రాఖీలు కట్టారు. దీంతో సంతోషం వ్యక్తం చేసిన ఎస్పీ వారికి రాఖీపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల పరిస్థితి, సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆకతాయిలు వేధిస్తున్నారా? అని తదితర విషయాలు గురించి మాట్లాడారు. రాఖీ పండుగ భారతీయ సంస్కృతిలో ప్రత్యేక స్థానం కలిగి ఉందని ఆయన చెప్పారు. రక్షణగా, అండగా నిలిచే సోదరుడికి రాఖీ కట్టి క్షేమంగా, సుఖసంతోషాలతో ఉండాలని సోదరీమణులు కోరుకుంటారని వివరించారు. పోలీసులకు రాఖీలు కట్టటం కేవలం సంప్రదాయం మాత్రమే కాకుండా పోలీసుశాఖపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. పోలీసుశాఖలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి మహిళలను కాపాడుతున్నట్లు తెలిపారు. మహిళల భద్రత కోసం సమస్యలు పరిష్కరించేందుకు శక్తి యాప్ రూపొందించారని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించి గొప్ప స్థాయికి చేరుకొని తల్లిదండ్రులు గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు.

880 కిలోల సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్‌ను మున్సిపల్ కార్యాలయానికి తరలించి పరిశీలిస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి, సిబ్బంది

బాపట్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణంలో వెదికే కొద్ది ప్లాస్టిక్ పట్టుబడుతున్నది. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆదేశాల మేరకు శానిటరి సిబ్బంది గురువారం సూర్యలంక రోడ్డులోని స్టేట్‌బ్యాంక్ ఎదురు ఉన్న గాయత్రి డ్రైఫ్రూట్స్ దుకాణం గోదాం తనిఖీ చేశారు. అందులో 880కిలోల సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకొని మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని ఫ్యాన్సీ దుకాణాల యాజమానులు, రెస్టారెంట్‌లు, హోటళ్ల యాజమానులు, కిరణా దుకాణాల వారు, పలు వ్యాపార సముదాయాల యజమానులు సింగిల్‌యూస్ ప్లాస్టిక్ వినియోగించరాదని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని నిషేధించారన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా సహకరించాలని ప్లాస్టిక్ కవర్లను స్వచ్ఛందంగా నిషేధించి గుడ్డ సంచులను, జనపనార సంచులను మాత్రమే వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. పట్టుబడిన దుకాణాల్లో మరోసారి అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే దుకాణాలు సీజ్ చేస్తామని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు సయ్యద్ నజీర్, సీహెచ్ కరుణ, పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ, శిశు సంక్షేమశాఖలో అంగన్‌వాడీలదే కీలకపాత్ర

● తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో యార్డు చైర్ పర్సన్ పూర్ణకుమారి



సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న వేమూరు యార్డు చైర్‌పర్సన్ పూర్ణకుమారి, సీడీపీవో లక్ష్మీదేవి

వేమూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో అంగన్‌వాడీలదే కీలక పాత్ర అని వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి అన్నారు. గురువారం మండలంలోని జంపనిలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూర్ణకుమారి హాజరై మాట్లాడుతూ స్త్రీ, శిశు సంక్షేమానికి కూటమి ప్రాధాన్యమిస్తుందన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాల ద్వారా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రయోజనం తెలుస్తుందన్నారు. మండల వైద్యశాఖాధికారి డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ తల్లిపాల ద్వారా బిడ్డల ఆరోగ్య పరిస్థితులు మెరుగుపడతాయన్నారు. సర్పంచ్ చుండూరు మరియమ్మ, సీడీ పీవోలు ప్రసంగించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు జరిపారు. పోషకాహార పదార్థాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అమృతవాణి, 53 కేంద్రాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, మండలంలోని 17 గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో గర్భిణులు, బాలింతలు హాజరయ్యారు.

బిడ్డలకు తల్లిపాలే రక్షణ కవచం

కొల్లూరు, ఆగస్టు 07 (ఆంధ్రజ్యోతి) : బిడ్డలకు తల్లిపాలే రక్షణ కవచమని అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి లక్ష్మీదేవి పేర్కొన్నారు. గురువారం కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో తల్లిపాల ముగింపు వారోత్సవాల కార్యక్రమానికి సీడీపీవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ శిశువు పుట్టగానే తల్లిపాలు అందించడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించి చీరసారెతో ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారావు, వైద్యాధికారి సంధ్య, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రజని, ఫజీరున్నీసా, కార్యకర్తలు ఆదిలక్ష్మి, పద్మ, కాశీవిశాలాక్షి, సౌభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం గ్రామపంచాయతీలోని గౌడపాలెం అంగన్‌వాడీ కేంద్రం నందు ఖాజీపాలెం అంగ్‌వాడీ సెక్టార్ వైజాగ్ తల్లిపాలు వారోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో శివపార్వతి పాల్గొని మాట్లాడుతూ తల్లిపాలు ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణి, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలోనే చేనేతకు గుర్తింపు

● చేనేత సహకార సంఘం అధ్యక్షుడు దివి రాంబాబు

చెరుకుపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చెరుకుపల్లిలోని ఆరుంబాక సహకారసంఘం వద్ద ఐలవరం, చెరుకుపల్లి, గుళ్ళ పల్లి, కనగాల, రాజోలు చేనేత కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు ప్రధాని నరేంద్రమోదీకి జాతీయ చేనేత దినోత్సవాన్ని ఏర్పరచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆరుంబాక చేనేత సహకార సంఘం అధ్యక్షుడు దివిరాంబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో చేనేత కార్మికులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. త్వరలో చేనేత చేయూత కింద కార్మికులకు సంవత్సరానికి 25వేల రూపాయలు ఇస్తామని ప్రకటించినందుకు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, చేనేత మంత్రి సవితలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశేష సేవలు అందించిన చేనేత కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో సాగునీటి సంఘాల చైర్మన్ ఎం రాధాకృష్ణమూర్తి, టీడీపీ నాయకులు కందుల వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, రాజవోలు చేనేత సహకార సంఘం అధ్యక్షుడు గొర్రె రమేష్ హ్యాండ్లూమ్ డవలప్‌మెంట్ అధికారి పి.వెంకట్రావు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవాన్ని సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. గురువారం భట్టిప్రోలులోని చేనేత కార్మిక సంఘం కార్యాలయం వద్ద సీనియర్ కార్మికులు కొతరపు పార్థసారధి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.బాలాజీ మాట్లాడుతూ, చేనేత సహకార సంఘాలకు దశాబ్దాలు గడిచినప్పటికీ ఎన్నికలు నిర్వహించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. తక్షణమే పాలక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కొడాలి రామకోటేశ్వరరావు, వీరమోహనరావు, ఏఐటీయూసీ నాయకులు బి.శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డీపీటీవోకు అభినందనలు



డీపీటీవో సామ్రాజ్యంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్టీసీఎంప్లాయిస్ యూనియన్‌నాయకులు

బాపట్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీ నాయకులు గురువారం డీపీటీవోను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కమిటీకి డీపీటీవో సామ్రాజ్యం అభినందనలు తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి ప్రభుత్వం మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్న సందర్భంగా కొన్ని సూచనలు చేశారు. మెరుగైన రవాణా సౌకర్యం కోసం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.చిరంజీవి, కార్యదర్శి కమలాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.వెంకట్రావు, కోశాధికారి నాగేశ్వరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి బిటి వలి, జోనల్ అధ్యక్షుడు వాకా రమేష్, జోనల్ జాయింట్ సెక్రటరి రజనీ, జిల్లాలోని నాలుగు డిపోల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు. జిల్లాలోని సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని తీర్మానించారు.

సర్దార్ వల్లభాయ్‌పటేల్ సేవారత్న అవార్డుకు మోర్ల శ్రీనివాసరావు ఎంపిక



మోర్ల శ్రీనివాసరావు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయాధికారి డాక్టర్ మోర్ల శ్రీనివాసరావు ఆయన చేసిన సేవలకు గాను అంతర్జాతీయ మనం ఫౌండేషన్‌వారు 2025కు సంబంధించి సర్దార్ వల్లభాయ్‌పటేల్ సేవారత్న నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారని అంతర్జాతీయ మనం ఫౌండేషన్ ఛైర్మన్ అండ్ ఫౌండర్ డాక్టర్ కె.చక్రవర్తి తెలిపారు. ఈ అవార్డును స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఈ నెల 14వ తేదిన హైదరాబాద్‌లోని ఆర్టీసి క్రాస్‌రోడ్డు కళాభారతి సిటి కల్చరల్ సెంటర్ నందు అందజేస్తారని మోర్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈఅవార్డుకు ఎంపికైనందుకు పలువురు ప్రముఖులు, శ్రేయోభిలాషులు, పాఠకులు, బంధు మిత్రులు మోర్ల శ్రీనివాసరావుకు అభినందనలు తెలియజేశారు.

అక్రమ లేఅవుట్లు క్రమబద్ధీకరించుకోవాలి

● కొత్తలేఅవుట్‌లకు డీటీసీపీ అనుమతులు తప్పనిసరి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పురపాలక సంఘం, అర్బన్‌డెవలప్‌మెంట్ అథారటి పరిధిలో ఉన్న అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. అదేవిధంగా ఇకపై వేసే లేఅవుట్లకు డీటీసీపీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. నిబంధనలు పాటించకుంటే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాపట్ల పురపాలక సంఘ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడుతూ రియల్‌ఎస్టేట్ వ్యాపారులు నిజాయితీగా వ్యాపారం చేయాలని ప్రజలను మోసం చేయాలనే చూస్తే ఉపేక్షించేదిలేదన్నారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉపయోగించుకొని క్రమబద్ధీకరణ చేసుకోవాలని యజమానులు, కొనుగోలుదారులకు సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై జరుగుతున్న అవగాహన సదస్సుకు గైర్హాజరైన కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణ ప్రణాళిక విభాగం రీజనల్ డైరెక్టర్ మధుకుమార్ మాట్లాడుతూ బాపట్ల, రేపల్లె పట్టణాల్లో అక్రమలేఅవుట్లు వేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత పట్టణ ప్రణాళిక విభాగం వారిపై ఉందన్నారు. ఈ సమావేశంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారటి ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి, బావుడా పీవో శోభన్‌బాబు, టౌన్‌ప్లానింగ్ అధికారి మల్లికార్జునరావు, లైసెన్స్ సర్వేయర్లు తదితరుల పాల్గొన్నారు.

చేనేత కార్మికుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న చేనేత కార్మికులు, కో-ఆపరేటివ్ నూతన సంఘ సభ్యులు

రేపల్లె, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులను అన్నివిధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. గురువారం చేనేత దినోత్సవం సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఇసుకపల్లి కంజుమర్స్ కోపరేటివ్ స్టోర్ లిమిటెడ్ కార్యవర్గసభ్యులు కార్యాలయంలో కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో బాగంగా చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్‌ను అందిస్తుందన్నారు. ముడిసరుకులో రాయితీలు ఇచ్చేవిధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చేనేత సొసైటీల అభివృద్ధి కోసం కూటమి ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. నూతనంగా ఎన్నికైన ఇసుకపల్లి కంజ్యూమర్స్ కోపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ అధ్యక్షుడిగా దివి సీతారామయ్య, డైరెక్టర్స్‌గా చంద్రశేఖరరావు, వంగర వెంకటేశ్వరరావు, రాజేశ్వరరావు, బాబూ వెంకట సుబ్బారావు, అడిగోపుల లక్ష్మీ, కొతవరపు మాధవీలతలు సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని శివప్రసాద్ కోరారు.

మురుగునీటి గుంతల్లో గంబూషియా చేపలు



నిల్వ ఉన్న నీటిలో గంబూషియా చేపలు వేస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి, సిబ్బంది

బాపట్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : నీటి గుంతలు నందు దోమల వృద్ధి అధికంగా ఉండటం దృష్టిలో ఉంచుకొని ప్రమాదకరమైన వ్యాధులు వ్యాపించకుండా దోమల లార్వాను తినే గంబూషియా చేపలను నీటి గుంతల్లో గురువారం మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి వేశారు. వీటి ద్వారా కీటకజనిత వ్యాధులను నివారించవచ్చునని ఆయన చెప్పారు. పట్టణంలోని మూడోవవార్డు రాజీవగాంధీకాలనీ, నరాలశెట్టిపాలెంలోని కోర్టు భవనం ఎదురు, సూర్యలంకరోడ్డులోని వ్యవసాయకళాశాల పక్కనే గుంతలలో వీటిని విడుదల చేశారు. పట్టణంలోని చాకలిపాలెం రైల్వేగేటు దగ్గర డ్రైనేజిలో నిల్వ ఉన్న మురుగునీటిని ఇంజన్‌లతో బయటకు తరలించే ఏర్పాటు చేశారు. దీనిని క్షేత్ర స్థాయిలో కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు సి.హెచ్.కరుణ, సయ్యద్ నజీర్, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు గంబుషియా చేపలు

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : దోమల నివారణకు గంబుష్ చేప పిల్లలను నీటిలో విడుదల చేసినట్లు సర్పంచ్ దారా కిరణ్మయి తెలిపారు. గురువారం నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి దోమల నివారణ నిమిత్తం గంబుష్ చేపలను ఆయా ప్రాంతాల్లోని నీటిలో వదిలారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కుమారి, హెల్త్ అసిస్టెంట్ తాజుద్దీన్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్‌లు, విద్యార్థులకు భోజనంప్లేట్లు

బాపట్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైలుపేట పార్క్ దగ్గర మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు రోటరీక్లబ్‌వారు సీలింగ్ ఫ్యాన్‌లు బహూకరించారు. విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి రోటరీక్లబ్ అధ్యక్షులు వేజండ్ల శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రోటరీ కార్యదర్శి కొత్త ఆంజనేయవరప్రసాద్, లక్ష్మీరాజ్యం దంపతుల సహకారంతో వీటిని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి కొత్త సుబ్బారావు, సీనియర్ సభ్యులు ఇ.హరిబాబు, బుర్లె రామసుబ్బారావు, జెవి.కృష్ణారావు, ఎస్.రమేష్‌బాబు, కోళ్ళపూడి ఉపేంద్రగుప్తా, షేక్.మస్తాన్ వలి, ఉపాధ్యాయులు రాజేష్, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు



బాప్టిస్టపాలెంలో నిలిచిపోయిన మురుగును పరిశీలిస్తున్న డాక్టర్ జీవలత, తదితరులు

చెరుకుపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం రావడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. తీరప్రాంత గ్రామాల్లో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వారందరూ చెరుకుపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. గురువారం ఎంపీడీవో షేక్‌మహబూబ్ సుభాని స్వయంగా గ్రామాల్లో తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆళ్ళవారిపాలెం గ్రామం బాప్టిస్ట్ కాలనీలో ఒక బాలికకు డెంగీ లక్షణాలు కనిపించగా చికిత్స అనంతరం తగ్గిపోయిందని అయినప్పటికీ ముందు జాగ్రత్త చర్యలుగా కాలనీలోని వారందరికీ కనగాల పీహెచ్‌సీ డాక్టర్ జీవలత ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ పెట్టి టెస్టులు చేస్తున్నామన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించామన్నారు.

స్వర్ణ తెర



- 50 ఏళ్లు దాటిన సిల్వర్ స్క్రీన్ థియేటర్లు
- తెలుగు సినిమా గమనానికి ఆనవాళ్లు..
- రీల్స్ నుంచి శాటిలైట్ ప్రదర్శన వరకు..
- నేల టిక్కెట్ నుంచి..ఆధునిక హంగులద్దుకుని..
- సినీ ప్రియులకు ఎన్నో జ్ఞాపకాలు

అలంకార్ టాకీస్, సురేష్ మహల్, బాలాజీ పిక్చర్స్, స్వరాజ్ థియేటర్.. తెలుగు చిత్ర పరిశ్రమ స్వర్ణయుగాన్ని చూసిన వెండి తెరలు ఇవి. స్వర్ణోత్సవాలు(50 ఏళ్లు) పూర్తి చేసుకుని..శతమానం భవతి అంటూ కొనసాగుతున్న సింగిల్ థియేటర్లు. కొండవీటి సింహం నుంచి దేవర వరకు.. ప్రేమాభిషేకం నుంచి తండేల్ వరకు.. పసివాడి ప్రాణం నుంచి..గేమ్ ఛేంజర్ వరకు హీరో తెరమీద కనపడగానే.. ప్రేక్షకులు వేసిన విజిల్స్, చప్పట్లు ఇంకా ఇక్కడ ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. నేల టిక్కెట్ నుంచి సోఫా సీటు వరకు.. రీల్ ప్రొజెక్టర్ నుంచి శాటిలైట్ డిజిటల్ ప్రొజెక్టర్ వరకు.. తెలుగు సినిమా గమనానికి ఇవి నిదర్శనం. కాలానుగుణంగా ఆధునిక హంగులు అద్దుకుంటూ సినీ ప్రియులను అలరిస్తూనే ఉన్నాయి. ఒక్కో సినిమా హాలుది ఒక్కో చరిత్ర, జ్ఞాపకం. స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్నవీ ఉన్నాయి. పైరసీల బెడద.. మల్టీప్లెక్స్‌ల పోటీ తట్టుకుని నిలబడి సింగిల్ థియేటర్లకు ఆనవాళ్లుగా కొన్ని మిగిలిపోతే.. కాల గర్భంలో కలిసి పోయినవి మరెన్నో. తెలుగు చిత్ర పరిశ్రమకు రెండు కళ్లు ఎన్టీఆర్, ఏఎన్ఆర్ చిత్రాలను నేల టిక్కెట్‌పై చూసిన వాళ్లు.. జూ.ఎన్టీఆర్, నాగచైతన్య సినిమాలను అత్యాధునిక సౌకర్యాలతో.. ఇవే థియేటర్లలో చూశారు.

చరిత్రకు సాక్ష్యం నాజ్

గుంటూరు (తూర్పు) ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నాజ్ థియేటర్లు ఏర్పడిన తర్వాత ఆ ప్రాంతం.. నాజ్ సెంటర్‌గా మారింది. 1958 జనవరి 11న జమున, షైనావతి, శివాజీ గణేషన్ నటించిన బొమ్మల పెళ్లి చిత్రంతో ఈ థియేటర్ల ప్రస్థానం మొదలైంది. నాటి ఎంపీ కొత్త రఘురామయ్య దీనిని ప్రారంభించారు. 1,547 సీటింగ్ సామర్థ్యం తో రూ.25 పైసల టికెట్ తో ప్రారంభమైంది. 1965లో నాజ్ థియేటర్ పై నాజ్ లిటిల్ బిగ్ పేరుతో రాష్ట్రంలోని తొలి ఏసీ సౌకర్యంతో మరో థియేటర్‌ను నిర్మించారు. నాజ్ లిటిల్ బిగ్ ఆ తర్వాత నాజ్ అప్సరగా మార్చారు. సురేష్ ప్రొడక్షన్ తొలి సినిమా అనురాగం ఈ థియేటర్లోనే ప్రదర్శించారు. వీటితోపాటు ఎన్టీ రామారావు నటించిన రాముడు భీముడు, కోడలు దిద్దిన కాపురం, దానవీరశూరకర్ణతో పాటు అనేక మహత్తర దృశ్య కావ్యాలకు ఈ థియేటర్ సాక్షిగా నిలిచింది. 1983లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు.. అప్పటి మంత్రి చేబ్రోలు హనుమయ్యతో కలిసి స్మాల్ స్కేల్ ఇండస్ట్రీపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతేగాక షూటింగ్ నిమిత్తం వచ్చే నటి, నటులకు ఈ థియేటర్లోనే బస ఏర్పాటు చేసేవారు. చాలా మంది సినీ ప్రముఖులు ఇక్కడ చిత్రాలను వీక్షించారు. దానవీరశూరకర్ణ సినిమాని రోజుకు ఆరు షోలను ప్రదర్శించారు. ప్రస్తుతం 700 సీట్లతో ఆధునీకరించి.. టిక్కెట్ ధర ప్రస్తుతం రూ.250కు చేరింది. ఇప్పటివరకు నాజ్ థియేటర్లో చిరంజీవి నటించిన ఇంద్ర సినిమా, నాజ్ అప్సరలో టి.కృష్ణ దర్శకత్వం వహించిన నేటి భారతం 175 రోజులు ప్రదర్శించారు. 2018 తర్వాత ఏ ఒక్క సినిమా కూడా 100 రోజులు ఆడలేదని యాజమాన్యం చెబుతోంది.



నాజ్ థియేటర్

ఎనిమిది దశాబ్దాలు.. 14న కూలీతో పునః ప్రారంభం

గుంటూరు మెడికల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో ఎనిమిది దశాబ్దాలుగా అలరిస్తోంది శ్రీ సరస్వతి పిక్చర్ ప్యాలెస్. స్వాతంత్ర్యం పొందిన మూడేళ్లకు.. 1950లో వాసిరెడ్డి పార్థసారథి ప్రసాద్ ఈ థియేటర్‌ను నిర్మించారు. 1989లో డాక్టర్ త్రిపురనేని రాధాకృష్ణ ఈ థియేటర్ కొనుగోలు చేశారు. ఇటీవల జిల్లాలో మొట్ట మొదటిసారిగా లేజర్ ప్రొజెక్షన్‌తో డాల్బీ సౌండ్ సిస్టమ్‌తో ఈ థియేటర్‌ను ఆధునీకరించారు. 385 సీట్ల కెపాసిటీ గల ఈ థియేటర్‌ను ఈ నెల 14న రజనీకాంత్ నటించిన కూలీ సినిమాతో పునఃప్రారంభిస్తున్నారు. ప్రేమ్ నగర్ సినిమా అద్భుతమైన కలెక్షన్లతో 175 రోజుల పాటు ఇక్కడ ప్రదర్శితం కావడంతో దివంగత నిర్మాత డి.రామానాయుడుకి ఈ హాలు అంటే ప్రత్యేక అభిమానం. దాదాపు 18 ఏళ్లపాటు సురేష్ ప్రొడక్షన్స్ ఈ హాలును లీజుకు తీసుకుంది.

● సరికొత్తగా..

బాపట్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బాపట్లలోని శ్రీనివాస మహల్‌కు 45 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. ఈ థియేటర్‌లో వంద రోజులు ఆడిన సినిమాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. కాలక్రమేణ నూతన హంగులను సంతరించ కుంది. కానీ, ఈ థియేటర్ పక్కనే ఉన్న అలంకార్, అన్నపూర్ణ థియేటర్లు శిథిలావస్థకు చేరి మూతపడ్డాయి.



● 60 ఏళ్ల నుంచి బొమ్మ పడుతోంది

తెనాలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ప్యారిస్ తెనాలి.. కళలకు పుట్టినిల్లు. సూపర్ స్టార్ కృష్ణ నుంచి ఎంతో మంది సినీ స్టార్లు ఇక్కడి నుంచి పుట్టుకొచ్చినవారే. వారు నటించిన సినిమాలు అందించేందుకు థియేటర్లకూ ఇక్కడ కొదవ లేదు. తెనాలిలో గెయిటీ, అలంకార్, స్వరాజ్, వీనస్, వెంకటేశ్వర, పెమ్మసాని, లక్ష్మి, శ్రీలక్ష్మి, ఆషా, ప్రియ, శ్రీప్రియ, సంగమేశ్వర, మినీ సంగమేస్వర వంటి థియేటర్లు గత 80 ఏళ్లుగా కొనసాగుతూ వచ్చాయి. డిజిటల్ యుగంలో.. పైరసీలతో విసిగిపోయి, లాభాలు లేక కొన్ని థియేటర్లు కనుమరుగయ్యాయి. స్వరాజ్, వేద, వీనస్, వెంకటేశ్వర, రత్న థియేటర్లు వాణిజ్య కేంద్రాలుగా మారిపోయాయి. రత్న, వెంకటేశ్వర థియేటర్లు స్వాతంత్ర్యానికి ముందే ప్రారంభమైతే.., స్వరాజ్ మాత్రం 1948లో ప్రారంభించారు. స్వాతంత్ర్యం రావడంతో ఈ థియేటర్‌కు స్వరాజ్ అని పేరుపెట్టారు. ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ పేరుపై అప్పట్లో నిర్మించిన రామకృష్ణ థియేటర్‌ను ప్రస్తుత కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తండ్రి కొనుగోలు చేసి, దానికి పెమ్మసాని థియేటర్‌గా పేరు మార్చారు.

అలంకార్, గెయిటీ

అలంకార్, గెయిటీ థియేటర్లు.. ఎన్టీఆర్, ఏఎన్నార్ సినిమాలకు ప్రత్యేకం. అలంకార్ థియేటర్‌ను 1964లో బండ్ల పుల్లయ్య నిర్మించారు. భక్తకన్నప్ప, కృష్ణవేణి, చిక్కడు దొరకడు, ఎన్టీఆర్ కథా నాయకుడు, పరమానందయ్య శిష్యుల కథ వంటి పాత చిత్రాల నుంచి భైరవద్వీపం, పసివాడి ప్రాణం, యమలీల, సంఘర్షణ వంటి చిత్రాలు శత దినోత్సవాలు జరుపుకున్నాయి. గెయిటీ థియేటర్‌ను 1965లో ప్రారంభించారు. సుబ్బారావు, రంగారావు అనే సోదరులు దీనిని నిర్వహిస్తూ వచ్చారు. ప్రస్తుతం వీరయ్యచౌదరి దీని నిర్వహణ చూస్తున్నారు. ఎన్టీఆర్, బాలకృష్ణ సినిమాలు ఎక్కువగా ఆడేవని వివరించారు. సమరసింహారెడ్డి 180 రోజులు ఆడితే, నరసింహనాయుడు సినిమా 175 రోజులు ఆడింది. పెద్దన్నయ్య, వేటగాడు, వంటి సినిమాలు 100 రోజులు ఆడాయి.



గెయిటీ థియేటర్

● ఐదు దశాబ్దాల ఆనవాళ్లు..

రేపల్లె, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలోని రేపల్లె పట్టణంలో ఐదు దశాబ్దాల కిందట నిర్మించిన కృష్ణా టాకీస్, రాజ్యలక్ష్మీ థియేటర్లు.. ఐదేళ్ల క్రితం.. డీటీఎస్, ఏసీ సౌకర్యాలు పొందాయి. నేల, బెంచి, కుర్చీ, బాల్కని నాలుగు కేటగిరిలుగా ఉన్న ఇవి.. రెండు విభాగాలు మార్చి ప్రేక్షకులకు అందుబాటులో ఉన్నాయి. కృష్ణా టాకీస్ థియేటర్ ఉన్న ప్రాంతం.. కృష్ణాటాకీస్ సెంటర్‌గా స్థిరపడింది. ఒకప్పుడు ఈ థియేటర్లలో.. వందల సినిమాలు వంద రోజులు ఆడాయి.



కృష్ణా థియేటర్



రాజ్యలక్ష్మిథియేటర్

● స్వాతంత్ర్యం గుర్తులు..

చెరుకుపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లిలో 1947లో గ్రామానికి చెందిన మజ్జి కోటయ్య జైహింద్ టాకీస్ ప్రారంభించారు. స్వాతంత్ర్యానికి పూర్వం.. ఈ స్థలంలో స్వాతంత్ర సమర యోధులు సమావేశమయ్యేవారని.. దానికి గుర్తుగా ఈ థియేటర్‌కు జైహిందు అని పెట్టారు. చుట్టు పక్కల మండలాలకు అప్పట్లో ఇదొక్కటే థియేటర్. సీనియర్ ఎన్టీఆర్ నటించిన కొండవీటి సింహం 100 షోలు పూర్తిచేసుకుంది. మెగాస్టార్ చిరంజీవి నటించిన అత్తకు యముడు.. అమ్మాయికి మొగుడు 60 షోలు, అక్కినేని నాగేశ్వరరావు నటించిన ప్రేమాభిషేకం 50 షోలు ప్రదర్శింపబడ్డాయి. ఇప్పుడు డాల్బీ అట్మాస్‌గా అప్డేట్ అయ్యింది. గుళ్ళపల్లి గ్రామంలో తాతా నారాయణమూర్తి, గుర్రం కుటుంబరావు, కాటూరి నాగమల్లేశ్వరరావు, పువ్వాడ వీరకుమారి భాగస్వామ్యంతో 1972లో బాలాజీ పిక్చర్ ప్యాలెస్‌ను ప్రారంభించారు. ఎన్టీఆర్ శ్రీకృష్ణ సత్య తులాభారం.. 50 రోజులు ప్రదర్శింపబడింది. మెగాస్టార్ చిరంజీవి ఇంద్ర సినిమా 60 రోజులు ప్రదర్శింపబడింది. ఏసీ థియేటర్‌గా దీనిని మార్చారు.



జైహింద్‌టాకీస్

● 60 ఏళ్ల నుంచి..అధునాత హంగులతో..

చీరాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చీరాల్లో పదికి పైగా సినిమా థియేటర్స్ ఉండేవి. ప్రస్తుతం నాలుగు థియేటర్లు మాత్రమే నడుస్తున్నాయి. వీటిల్లో మోహన్ థియేటర్ 1956లో ప్రారంభమైంది. ఇందులో అక్కినేని నాగేశ్వరరావు రోజులు మారాయి చిత్రం అత్యధికంగా 156 రోజులు ఆడిన మొట్ట మొదటి చిత్రంగా చరిత్ర సృష్టించింది. అనంతరం ముత్యాల ముగ్గు, నాగార్జున నటించిన హలో బ్రదర్, అర్జున్ నటించిన ఒకే ఒక్కడు వంటి చిత్రాలు 100 రోజులు ఆడి ప్రేక్షాదరణ పొందాయి. అలాగే చీరాల్లో శాంతి థియేటర్ 1967లో ప్రారంభమై దేవుడు చేసిన మనుషులు, నువ్వు నాకు నచ్చావ్, లక్ష్మీనరసింహా, దేశముదురు వంటి చిత్రాలు 100 రోజులు ఆడి అందరినీ అలరించాయి. టెక్నాలజీని అందిపుచ్చుకుని నేటికీ నూతన హంగులతో ప్రేక్షకులతో ఈ థియేటర్లు సందడి చేస్తున్నాయి.



శాంతి థియేటర్

● సినీ వైభవానికి మహళ్లు..

వినుకొండ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న అరుణ హాలు 64 ఏళ్లు పూర్తి చేసుకుంది. నూతన హంగులతో సినీ ప్రేక్షకులను ఇప్పటికీ అలరిస్తోంది. ఈ థియేటర్‌లో నర్తనశాల 50, ప్రేమాభిషేకం 50 రోజులు రెగ్యులర్ షోస్.. నూన్ షోస్‌తో 100 రోజులు పూర్తి చేసుకున్నాయి. అలాగే పట్టణంలోని సురేష్ మహల్ 1975లో సోగ్గాడు సినిమాతో ప్రారంభమైంది. 50 ఏళ్ల క్రితం తెర బొమ్మలతో మొదలై 70ఎంఎం రీల్స్, నేడు యూఎఫ్‌వో, క్యూబ్ (శాటిలైట్) ద్వారా సినిమాలు ప్రదర్శితమవుతున్నాయి. ఈ రెండు థియేటర్లలో.. డీటీఎస్‌తో నేటి యువత విజిల్స్ వేసేలా సినిమాలు ఆడుతున్నాయి.



అరుణ హాల్

బస్సుల్లో పెరగనున్న..

స్త్రీ శక్తి మేరకు ఏర్పాట్లు

మహిళల ఉచిత ప్రయాణానికి ఆర్టీసీ సమాయత్తం



ఫుట్ బోర్డు పనులు ,



ఫుట్ బోర్డు మధ్యలో ఐరన్ పైపులు



అత్యవసర ద్వారం



హ్యాండిల్ స్లింగ్స్

- పల్లెవెలుగు బస్సుల్లో ప్రత్యేక సౌకర్యాలు
- బస్టాండ్లలోనూ.. అదనపు హంగులు.
- మహిళల రద్దీకి అనుగుణంగా చర్యలు

గుంటూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని స్త్రీ శక్తి పథకం పేరుతో.. ఆగస్టు 15 నుంచి ప్రారంభించనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆ దిశగా ఆర్టీసీ యంత్రాంగం సమాయత్తమవుతోంది. ముఖ్యంగా ఉచిత ప్రయాణంలో మహిళలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రధానంగా పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, నగరంలోని మెట్రో, ఆర్డినరీ సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు ఇప్పటికే ఆర్టీసీ ప్రకటించింది. మరో వారం రోజుల్లో స్వాతంత్ర దినోత్సవం రోజు నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలుకు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు ఏర్పాట్లకు.. సంబంధించి ఇప్పటికే నెల్లూరు జోన్ పరిధిలోని గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని అధికారులతో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి గుంటూరులో సమావేశం నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా పథకం ప్రారంభ దశలో మహిళలు పెద్ద ఎత్తున బస్టాండ్‌లకు చేరుకుంటారని, బస్సుల్లో రాకపోకలకు కూడా ఇప్పుడున్న రద్దీకి 20 నుంచి 30 శాతం అదనంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. విభజిత గుంటూరు జిల్లా పరిధిలోని గుంటూరు -1, 2 డిపోలతో పాటు పొన్నూరు, మంగళగిరి, తెనాలి డిపోలలో 403 సర్వీసులుండగా ఇందులో 275 పల్లెవెలుగు సర్వీసుంటాయని ఇన్‌చార్జి డీపీటీవో సామ్రాజ్యం తెలిపారు. ఇప్పటికే 80 రూట్లలో రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. ప్రస్తుతం పాఠశాల విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉచితంగా రాకపోకలు సాగిస్తుండగా ఇకపై కళాశాలల విద్యార్థునుల కోసం కూడా అదనపు ట్రిప్పులను నడుపుతామన్నారు. అలానే బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, చీరాల, రేపల్లె, అద్దంకి డిపోల్లోనూ 253 సర్వీసుల్లో 212 పల్లె వెలుగు సర్వీసులు అత్యధికంగా ఉన్నాయని తెలిపారు. మహిళల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బాపట్ల జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో)గా వ్యవహరిస్తున్న సామ్రాజ్యం గుంటూరు ఇన్‌చార్జి డీపీటీవో కూడా కావటంతో ఆమె రెండు జిల్లాల్లోనూ ఆపరేషన్ వ్యవహారాలను పర్యవేక్షించడం తలకుమించిన భారంగా మారిందన్న వాదన వినిపిస్తోంది.

పల్లె వెలుగు బస్సులకు అదనపు ఏర్పాట్లు

ముఖ్యంగా పల్లెవెలుగు బస్సుల్లో మహిళల తాకిడి ఎక్కువగా ఉంటుందని అంచనా వేసిన అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. బస్సు ఫుట్ బోర్డును విస్తరించి , మెట్లు జారకుండా గ్రిప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కే సమయంలో చేతులు పట్టుకునేలా మెట్ల మధ్యలో రాడ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అలానే బస్సులో మహిళలు నిల్చొని పట్టుకునేలా హ్యాండ్ స్లింగ్స్ అందుబాటులోకి తెస్తున్నారు. మరో వైపు విపత్కర పరిస్థితుల్లో ప్రమాదం నుంచి బయటపడేలా ఎమర్జన్సీ డోర్‌లను కూడా అందుబాటులో ఉంచుతున్నారు. ఈ డోర్‌కు హ్యాండ్‌లాక్, రైల్వే లాక్, టవర్ బోల్ట్ అమర్చుతున్నారు. ఈ మేరకు పల్లె వెలుగు బస్సులకు ఆర్టీసీ గ్యారేజ్‌లలో శరవేగంగా పనులు జరుగుతున్నాయి.

బస్టాండ్‌లలో అదనపు సౌకర్యాలు

అలానే బస్టాండ్‌లలో కూడా ప్రస్తుతమున్న సీట్లకు అదనంగా సీట్లను పెంచుతున్నట్లు గుంటూరు జిల్లా ఇన్‌చార్జి డీపీటీవో సామ్రాజ్యం తెలిపారు. ప్రస్తుతమున్నవాటి కంటే అదనంగా మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఎన్టీఆర్ బస్టాండ్‌లో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను కూడా అందుబాటులోకి తెస్తున్నట్లు డీపీటీవో పేర్కొన్నారు.

ఉచిత ప్రయాణానికి ఐడీ కార్డు చూపాలి

ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణ పథకం అమలుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు డీపీటీవో సామ్రాజ్యం తెలిపారు. బస్సులలో ఉచిత ప్రయాణానికి మహిళలు ఆధార్ వంటి ఏదో ఒక ఐడీ కార్డు తప్పనిసరిగా సిబ్బందికి చూపించాలని పేర్కొన్నారు.

కిరాయి లొల్లి..మళ్లీ!

- నేడు సమావేశానికి రావాలని యజమానులకు ఎస్ఎంఎస్‌లు

గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రాష్ట్రాలకు గుంటూరు నగరం నుంచి మిర్చిని రవాణ చేసే లారీల కిరాయి పెంచేందుకు మళ్లీ ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. గతేడాది ఒక అసోసియేషన్ కనుసన్నల్లో భారీగా కిరాయి పెంచి ఇక్కడి వ్యాపారం అంతా వేరే ప్రాంతాలకు వెళ్లేలా చేయడంతో.. ఎక్స్‌పోర్టర్లు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అప్పట్లో ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అసోసియేషన్‌తో సంబంధం లేకుండా ఎగుమతిదారులు ఇష్టమొచ్చిన లారీ యజమాని ద్వారా సరుకు రవాణ చేసుకొనేందుకు అవకాశం కల్పించాలని నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా అడ్డు పడితే కేసులు నమోదు చేయాలని పోలీసు శాఖని ఆదేశించారు. దాంతో అసోసియేషన్ ప్రమేయం పూర్తిగా తొలగిపోయింది. అప్పటి నుంచి ఈశాన్య రాష్ట్రాలకు రూ.1.20 లక్షలకే లారీ యజమానులు మిర్చిని రవాణా చేస్తున్నాయి. దీంతో మార్కెట్ కొంతమేరకు మళ్లీ ఇక్కడ పుంజుకొంది.

గతంలో వైసీపీ కనుసన్నల్లో..

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు ఒక అసోసియేషన్‌ని ఏర్పాటు చేసి.. ఈశాన్య రాష్ట్రాలకు లారీ కిరాయిని వారి.. కనుసన్నల్లోనే జరిగేలా వ్యవస్థని నెలకొల్పారు. దీంతో కిరాయి రూ.1.50 లక్షల నుంచి రూ. 1.70 లక్షలు లారీకి వసూలు చేసేవారు. అది చాలక ఇంకా పెంచాలని డిమాండ్ కూడా చేశారు. అంతకంటే ఎవరైనా లారీ ఓనరు తక్కువ కిరాయికి ఒప్పందం చేసుకొంటే ఆ లారీకి అడ్డు పడి నానా యాగీ చేసేవాళ్లు. టైర్లు కోసేయడం, లారీ యజమానిపై దాడి చేయడం వంటివి చేసేవారు. దీంతో ఎగుమతి వ్యాపారులు బెంబేలెత్తిపోయేవారు. మరోవైపు ఖమ్మంలో అప్పట్లో రూ.1.20 లక్షలకే లారీలు కిరాయికి పెట్టేవాళ్లు. ఈ కారణంగా చాలా వరకు వ్యాపారం అక్కడికి తరలిపోయింది.

కాగా ఇప్పుడు మళ్లీ ఈశాన్య రాష్ట్రాలకు కిరాయి పెంచేందుకు నార్త్ ఈస్టు లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ యజమానులంతా సమావేశానికి రావాలని గురువారం కొంతమంది ఫోన్లకు ఎస్ఎంఎస్‌లు వెళ్లాయి. బుడంపాడు రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద ఈ సమావేశం నిర్వహించనున్నారు. దీనిపై ఇంటెలిజెన్స్ వర్గాలు వివరాలు సేకరిస్తున్నాయి. లారీ ఓనర్లు వాళ్ల సమస్యలపై చర్చించుకొంటే తమకు ఎలాంటి ఇబ్బంది లేదని, అలా కాకుండా గతంలో మాదిరి కిరాయి పెంచుతామంటే ఇక్కడి మార్కెట్ నష్టపోతుందని ఎగుమతి వ్యాపారులు తెలిపారు.

స్వయం సహాయక బృందాల పనితీరుపై..

కేంద్ర బృందం పరిశీలన

గుంటూరు సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న స్వయం సహాయక బృందాల పనితీరును జాతీయ బృందం గురువారం పరిశీలించింది. గురువారం గుంటూరు మిర్చి యార్డు, వ్యవసాయ కమిషనరేట్‌తో పాటు, పలు సంఘాలు నిర్వహిస్తున్న వ్యాపార సంస్థలను సందర్శించిన బృంద సభ్యులు వివరాలు సేకరించారు. అనంతరం వివిధ మండలా నుంచి వచ్చిన స్వయం సహాయక సంఘ సభ్యులతో భేటీ అయ్యారు. ఈ భేటీ లో పచ్చళ్లు, కారప్పొడుల ఉత్పత్తిదారుల అనుభవాలు, ఔత్సాహికుల వివరాలను తెలుసుకున్నారు. అరవింద్ పాటిదర్, జనార్దన్‌రౌత్, గోపాల కృష్ణ, శివ శంకర్ ప్రసాద్, రాజశ్రీ, పీడీ టీవీ విజయలక్ష్మి, ఎస్.కిరణ్ కుమార్, టి. అశోక్ కుమార్ పాల్గొన్నారు.



మిల్లును పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఆర్‌వీఆర్ జేసీ స్నాతకోత్సవం రేపు

- హాజరుకానున్న సుప్రీం కోర్టు మాజీ సీజే ఎన్.వి.రమణ

గుంటూరు విద్య ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక చేడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 10వ స్నాతకోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ రాయపాటి గోపాల కృష్ణ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఎన్వీ రమణ, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధు మూర్తి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. 2021 - 25 విద్యా సంవత్సరం, 37వ బ్యాచ్ బీటెక్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రీ పూర్తి చేసుకున్న 1,023 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను, 153 మందికి పీజీ పట్టాలు పొందనున్నారని పేర్కొన్నారు. గోల్డ్ మెడల్స్ ప్రదానం ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్ అండ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్.ఎన్.వి. శ్రీనివాసరావు తదితరులు ఏర్పాట్లను గురువారం పర్యవేక్షించారు.



సుప్రీంకోర్టు మాజీ సీజే ఎన్వీ రమణ, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య మధు మూర్తి

మిర్చి కాటా వేయగానే..

రైతు ఫోన్‌కి ఎస్ఎంఎస్ వెళ్లాలి

- మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత

గుంటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డులో రైతులు తీసుకొచ్చిన టిక్కీలు అమ్మకం పూర్తి అయ్యి.. కాటా వేయగానే ఆటోమేటిక్‌గా స్లిప్పు జనరేట్ కావాలని, సంబంధిత రైతు మొబైల్ నంబరుకు ఎస్ఎంఎస్ ద్వారా చేరేలా చూడాలని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ విజయ సునీత ఆదేశించారు. గురువారం సాయంత్రం చుట్టుగుంటలోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో ఆమె గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ.. ఈనామ్‌లో ఇంకా ఏమైనా లోటుపాట్లు ఉంటే వచ్చే సీజన్ నాటికి సవరించి 100 శాతం పకడ్బందీగా అమలు జరిగేలా చూడాలన్నారు. మచ్చు కాయలు, జీరో, కటింగ్, బిల్ టూ బిల్ బిజినెస్‌ల రూపు మాపాలని స్పష్టం చేశారు. గత సీజన్‌లో దాదాపుగా మార్కెట్ ఫీజు రూ.10 కోట్ల మేరకు తగ్గిందని, దానిని రాబోయే రోజుల్లో భర్తీ చేయాలన్నారు. మిర్చి మార్కెట్ పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే సీజన్‌ని దృష్టిలో పెట్టుకొని ఇప్పటినుంచే అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు విశ్రాంతి గదులు, లైటింగ్ వంటి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రత్తిపాడు ఏఎంసీ పరిధిలో వ్యాపారాలు చేస్తున్న లైసెన్సులను ఆ కమిటీకి బదిలీ చేసే విషయంపై ప్రతిపాదనలు పంపించాలన్నారు. మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ చంద్రిక, డీడీ దివాకర్, ఏడీ సత్యన్నారాయణ చౌదరి, ఎస్ఈ శేషగిరిరావు, యార్డు ఇన్‌ఛార్జ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు ఏఎంసీ అధికారులతో సమావేశమైన డైరెక్టర్ విజయ సునీత, జేడీలు

అవీ..ఇవీ..

గ్రంథాలయాలతో ఉన్నత భవిష్యత్తు



సన్మాన గ్రహీతలు ధనమ్మ, కానిస్టేబుల్స్

చీరాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవడం వలన ఉత్తమ భవిష్యత్తు ఉంటుందని గ్రంథపాలకులు ధనమ్మ, కుదిటి ప్రసాద్ అన్నారు. ఐదేళ్లశాఖ గ్రంథాలయం చీరాలకు బాధ్యతలు నిర్వర్తించిన ధనమ్మ బదిలీపై ఉప్పుగుండూరుకు వెళ్తున్నారు. ఈక్రమంలో అందుకు సంబంధించి ఆమెకు పలువురు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అలాగే అదే గ్రంథాలయంలో పాఠకులుగా ఉంటూ ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన ఎనిమిది మందికి కూడా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యలమందారెడ్డి, నాగవీరభద్రాచారి, బ్రహ్మారెడ్డి, రాధాకృష్ణ, కృష్ణమూర్తి, పవని భానుచంద్రమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండాలి

మార్టూరు, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి) : యువత డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండాలని మార్టూరు సీఐ ఎం.శేషగిరిరావు అన్నారు. ఈగల్ సెల్ బాపట్ల వారి ఆధ్వర్యంలో గురువారం మార్టూరులోని రాయల్ ప్రైవేటు జూనియర్ కళాశాల పోలీసులు విద్యార్థులకు 'డ్రగ్స్ వద్దు బ్రో' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపైనే దృష్టిసారించాలన్నారు. చెడు వ్యసనాలకు లోను కావద్దన్నారు. విద్యార్థులతో 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ నినాదాలు చేయించారు. అదేవిధంగా 1972 ఈగల్ టోల్ ఫ్రీ నెంబరును సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్కూల్ డైరెక్టర్ వీరగంధం శ్రీనివాసరావు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఇదిలా ఉండగా, యద్దనపూడి మండలంలో పూనూరు జడ్పి హైస్కూల్‌లో ఎస్ఐ టి రత్న కుమారి 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమం నిర్వహించారు.

పేదలకు అందుబాటులో నాణ్యమైన వైద్యం

- నేడు అపోలో వార్షికోత్సవ వేడుకలు



విలేకర్లతో మాట్లాడుతున్న అపోలో వైద్యులు

చీరాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : చీరాల చుట్టుపక్కల నివసించే పేదవారికి నాణ్యమైన వైద్యం అందించేందుకే అపోలో స్పెక్ట్రా హాస్పిటల్స్ నిరంతరం కృషిచేస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ డా.రవి కిరణ్ పేర్కొన్నారు. అపోలో హాస్పిటల్ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నారు. అందుకు సంబంధించి గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యవసర ట్రామా వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి అవస్థలు పడే పరిస్థితి లేకుండా స్థానికంగానే 10 విభాగాలకు సంబంధించి అనుభవం కలిగిన వైద్యులతో సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే రామాపురం, వీరన్నపాలెం గ్రామాలను దత్తత గ్రామాలుగా ఏర్పాటు చేసుకుని సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డి.నిరుపమ వైద్యులు గోపీవర్మ, ఫణికుమార్, వంశీ, రంగనాథ్, లతశ్రీ, సరోజిని నాయుడు, సజ్న, కార్తీక్ పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

యద్దనపూడి,(మార్టూరు) ఆగస్టు7 :(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలోని గన్నవరం గ్రామంలో రూ.94 లక్షల నిధులతో జలజీవన్ మిషన్ పనులకు గురువారం టీడీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షులు నల్లపనేని రంగయ్య చౌదరి మాట్లాడుతూ పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు నిధులు మంజూరుకు కృషి చేశారన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ, మైనారిటీ కాలనీలలో సుమారు 400 కుటుంబాలకు ఇంటింటికి కుళాయిలను ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరయ్యాయన్నారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేసి రెండు కాలనీల్లో ఇంటింటికి కుళాయిలను ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా వారికి మంచినీటి సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చైతన్య, పంచాయతీ కార్యదర్శి కృపారావు, టీడీపీ నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడిపై దాడి

- ఇరువురు అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

సింగరాయకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఇరువురు యు వకులు మరో యువకుడిపై విచక్షణారహితంగా దాడిచేసి గాయపరిచారు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని పా తసంత వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జరుగుమల్లి మండలం తూమాడు గ్రామానికి చెందిన కసుకుర్తి కోటేశ్వరరావు బైక్‌పై వెళ్తుం డగా సింగరాయకొండ ఆంజనేయనగర్‌కు చెందిన బండి నవీన్, టంగుటూరు పోతుల చెంచయ్య కాలనీలో నివాసం ఉంటున్న గంటిపూడి ప్రణయ్ ఇరవురు పూటుగా మద్యం సేవించి కోటేశ్వరరావుపై దాడిచేసి గాయపరిచారు. అనంతరం బాధితుడుని వైద్యం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌లో చేరాడు. అక్కడ నుంచి వచ్చిన పోలీస్ ఇంటిమేషన్ మేరకు సింగరాయకొండ ఎస్సై బి.మహేంద్ర ఇరువురు యువకులపై కేసు నమోదు చేశారు. గురువారం స్థానిక జాతీయ రహదారి క నుమళ్ల అడ్డరోడ్డులో నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించిందని ఎస్సై మహేంద్ర తెలిపారు.

స.హ. చట్టంపై అవగాహన పెంచుకోవాలి

మద్దిపాడు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ప్రతి ఒక్క రూ అవగాహన పెంచుకోవాలని ఉపసర్పంచ్ ముల్లూరు మురళి అన్నారు. గురువారం దొడ్డవరప్పాడు గ్రామ సచివాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టం కింద కార్యాలయాల్లో సమాచారం తీ సుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వీఆర్వో అంకమ్మ, డిజిటల్ అసిస్టెంట్ నీలిమ, జి.సాయిచంద్, బి.రాంబాబు, హేమలత, స్వాతి, జి.సతీష్, ఎల్.తరు ణ్, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

చేనేతకు చేయూతనిద్దాం

- ఎమ్మెల్యే కొండయ్య
- చీరాలలో పండుగ వాతావరణంలో చేనేత దినోత్సవం
- పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజా ప్రతినిధులు
- పర్యాటకం, ఆక్వా అభివృద్ధిపైనా మాట్లాడిన నేతలు



మంత్రి సవిత, ఎమ్మెల్యే కొండయ్యను గజ మాలతో సత్కరిస్తున్న చేనేతలు

జాండ్రపేట(చీరాల), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : చేయి చేయి కలిపి చేనత రంగానికి చేయూతనిద్దామని ఎమ్మెల్యే కొండయ్య పిలుపునిచ్చారు. గురువారం చీరాల మండలం జాండ్రపేట హైస్కూల్లో 11వ జాతీయ చేనేత దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రులు సవిత, డోలా బాలవీరాంజనేయస్వామి, బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ కుమార్‌రెడ్డి, దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ, కలెక్టర్ వెంకట మురళీ, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, సలగల రాజశేఖర్‌బాబు హాజరయ్యారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ 1905లో విదేశీ వస్త్ర బహిష్కరణతోనే చేనేత వస్త్రానికి ప్రాధాన్యత సంతరించుకుందని చెప్పారు. నియోజక వర్గంలో నేతన్నలు పూటగడవక అవస్థలు పడుతున్నట్లు వివరించారు. చీరాల్లో చేనేత బిడ్డల బాగోగులు కోసం నిరంతరం రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో పాటుపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల మహిళలకు రూ.10 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అయితే కార్యక్రమం ఆద్యంతం ప్రజాప్రతినిధులు అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు.

చేనేతలకు అండగా సీఎం : ఏలూరి



సీఎం చంద్రబాబునాయుడి కుటుం బం చేనేతలకు అండగా నిలుస్తోందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు అన్నారు. ఈ నేపథ్యంలోనే చేనతల సమస్యల పరిష్కారం కోసం మంగళగిరి నుంచి లోకేష్‌ను ఎన్నికల బరిలో నిలిపినట్లు తెలిపారు. తండ్రికి తగ్గ తనయుడిలా చేనేతకు బాసటగా మంత్రి లోకేష్ నిలిచారన్నారు. పర్చూరు నియోజక వర్గంలోని మోటుపల్లికి పోర్టు నిర్మాణంతో అభివృద్ధి జరుగుతుందని వివరించారు.

చేనేతలకు కూటమితో వరాలు : గొట్టిపాటి లక్ష్మి



కూటమి ప్రభుత్వంతో చేనేతలకు వరాలజల్లు అని దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. ఈ క్రమంలోనే ఉచిత విద్యుత్, జీఎస్టీ భారం తీరిందని చెప్పారు. గత ప్రభుత్వం నిరంకుశత్వం వలన రాష్ట్రం అట్టడుగు చేరిందని చెప్పారు. కుప్పడంకు జాతీయ గుర్తింపు కాణంగా విక్రయాలు పెరిగి సమస్యలకు పరిష్కారం ఉంటుందని చెప్పారు.

టూరిజం హబ్‌తో ఉపాధి



నియోజకవర్గంలో త్వరలో టూరిజం హబ్ ఏర్పడు తుందని తద్వారా ఉపాధి పెరుగుతుందని మారి టైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య పేర్కొన్నారు. ఫిషింగ్‌హార్బర్ నిర్మాణం వేగవంతంగా జరుగుతోందన్నారు. మోటుపల్లి వద్ద పోర్టు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

మారి టైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య

రెండు ప్రాంతాలు అభివృద్ధి చేస్తాం : నరేంద్రవర్మ



సూర్యలంక, వాడరేవు ప్రాంతాలను అన్నదమ్ముల్లా కొండయ్యతో కలిసి అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ అన్నారు. పర్యాటకంతోపాటు, ఆక్వా, చేనేత రంగాలు ఇక పుంజుకుంటా యని వివరించారు. లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ అని ఎప్పుడూ చెబుతూ ఉంటాను. అదే మాదిరిగా మినీగోవాలా తీర ప్రాంతాలు ఉంటా యని అన్నారు. జంట నగరాల్లా చీరాల, బాపట్లకు కూటమి ప్రభుత్వంతో మహర్దశ సంతరించుకుందన్నారు.

రైతుల వద్ద 30 మిలియన్ల పొగాకు

- రాష్ట్రవ్యాప్తంగా 30 కొనుగోలు కేంద్రాలు
- చివరి ఆకు వరకు పొగాకు కొనుగోలు చేస్తాం
- పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నరేంద్రవర్మ, ఏలూరి

కర్లపాలెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రైతు లు వద్ద నుంచి పొగాకు కొనుగోలు చేసేందు కు గోదాములన్ని నిండుగా ఉన్నాయని అందు వలన దూరప్రాంతమైనప్పటికిని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళిల చొరవతో కర్లపాలెంలోని ఎఫ్‌సిఐ గోదాములలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. కర్లపాలెంలోని ఎఫ్‌సిఐ గోదాములలో నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఎమ్మెల్యేలు నరేంద్ర వర్మ,ఏలూరి సాంబశివరావులు మార్క్‌ఫెడ్, ఎఫ్‌సిఐ గోదాముల అధికారులతో కలిసి గురువారం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సాంబశివరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల దగ్గర 30మిలియన్‌ల పొగాకు సరుకు ఉన్నదని దానిని చివరి ఆకు వరకు రైతులు దగ్గర నుంచి కొనుగోలు చేస్తామన్నారు. 30 సెంటర్‌లో పొగాకు కొనుగోలు చేస్తున్నారని ప్రతిసెంటర్ నుంచి 500క్వింటాళ్ళ పొగాకు తగ్గకుండా కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. రైతులఖాతాల లో నగదు జమకాలేదని ప్రభుత్వం ప్రాసెస్ చేసి పొగాకు విక్రయించిన ప్రతిరైతుకు త్వరలో నగదు జమఅయ్యేవిధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా రైతుల దగ్గర నుంచి పొగాకును కొనుగోలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వెల్లంపలి పొగాకు బోర్డు ఆధ్వర్యంలో బర్లీకొనుగోలకు కొంత స్థలం కేటాయించిందన్నారు. గోదాముల వద్దకొచ్చిన బర్లీపొగాకు ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, నరేంద్రవర్మలు మార్క్‌ఫెడ్ అధికారులతో కలిసి పొగాకును పరిశీలించారు. పొగాకు రైతులు ఈఅవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బావుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, తె.దె.పా నాయకులు ఏపూరి భూపతిరావు, మాడా శ్రీనివాసరావు, మునిపల్లి చిన్న, మద్దిబోయిన తిరుపతయ్య, పిట్ల వసంతరెడ్డి, తె.దె.పా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : ఇంకొల్లు మండల పరిధిలోని పొగాకు రైతులు పొగాకు వేగవంతంగా అమ్ముకునేందుకు మరో పొగాకు కేంద్రాన్ని గురువారం వెల్లంపల్లిలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రారంభించారు. రైతులు ఆందోళన చెందకుండా తమ పొగాకును విక్రయించుకోవాలన్నారు. అధికారుల తెలిపిన నిబంధనల ప్రకారం రైతులు తమ పొగాకును కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పర్చూరు మార్కెట్‌యార్డు ఛైర్మన్ గుంజి వెంకట్రావు, ఇంకొల్లు పీఏసీఎస్ ఛైర్మన్ కరి శ్రీనివాసరావు, ఇంకొల్లు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ముప్పవరంలో వీధిదీపాలు, విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేయండి

అధికారులకు మంత్రి రవికుమార్ ఆదేశం



సుశీలను పరామర్శిస్తున్న మంత్రి రవికుమార్

పంగులూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ముప్పవరం గ్రామంలోని లేఅవుట్‌లో వీధిదీపాల ఏర్పాటుతో పాటు ఫ్లైఓవర్ సమీపంలో అప్రోచ్‌రోడ్డుకు పడమటివైపున నివాసగృహాల మధ్య నూతన విద్యుత్‌లైన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని విద్యుత్‌శాఖ ఎ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం ముప్పవరం, జాగర్లమూడివారి పాలెం గ్రామాలలో పర్యటించారు. గ్రామంలోని లేఅవుట్‌లో వీధి దీపాలు లేక ఇబ్బందిగా ఉందని నివాస గృహాలకు విద్యుత్‌లైన్ అందుబాటులో లేక విద్యుత్ సౌకర్యం పొందేందుకు ఇబ్బంది పడుతున్నామని స్థానిక నేతలు కుక్కపల్లి ఏడుకొండలు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, గరిమిడి జగన్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకుపోయారు. స్పందించిన మంత్రి వెంటనే చర్యలు చేపట్టాలని ఈఈ మస్తాన్‌రావును ఆదేశించారు. అనంతరం జాగర్లమూడివారిపాలెం గ్రామంలో ఇటీవల చేతికి శస్త్రచికిత్స చేయించుకున్న గోనుగుంట్ల హనుమంతరావు సతీమణి సుశీలను మంత్రి గొట్టిపాటి పరామర్శించారు.

ఫ్లైఓవర్ ఏర్పాటుకు రైతుల వినతి

మండలంలోని 16వ నెంబరు జాతీయ రహదారిని కలుపుతూ నూతనంగా నిర్మిస్తున్న విజయవాడ, బెంగుళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవేలో రైతులు పంటపొలాలకు వెళ్లేందుకు వీలుగా కోనేటి డొంక మార్గంలో ఫ్లై ఓవర్ ఏర్పాటు చేయాలని జాగర్లమూడివారిపాలెం గ్రామరైతులు మంత్రి గొట్టిపాటికి వినతిపత్రం అందజేశారు. జేవీ.పాలెం రైతులతో పాటు ముప్పవరం గ్రామ రైతులు కూడా ఈ సమస్య పరిష్కర్కించాలని కోరారు. కార్యక్రమంలో కేవీ.సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, డీసీ అధ్యక్షుడు కుక్కపల్లి ఆంజనేయులు, నార్నె సుబ్బారావు, కోమటి ప్రసాద్, వరపర్ల సుబ్బారావు, చింతల సహదేవుడు, గుర్రం ఆదిశేఖర్, ఓబుల్‌రెడ్డి, చిలుకూరి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, ఉన్నం రవి, పలుగ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఒంగోలులో ఉత్సాహంగా క్రీడా పోటీలు



పోటీలకు హాజరైన క్రీడాకారులు

జాతీయ క్రీడా దినోత్స వం పురస్కరించుకుని జిల్లా క్రీడాప్రాధికార సం స్థ ఆధ్వర్యంలో నిర్వహిం చిన క్రీడాపోటీలు గురువారం ఘనంగా ప్రారం భమయ్యాయి. మూడు రోజులపాటు ఒంగోలు మినీస్టేడియంలో జరిగే ఈ పోటీలకు వ్యాయామోపాధ్యాయుల సం ఘం జిల్లా అధ్యక్షుడు వై.శీనయ్య అధ్యక్షత వహించగా, డీఆర్వో చినఓబులేసు, డీఈవో కిరణ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్, ఆర్చరీ, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, బాస్కె ట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, హాకీ, వాలీబాల్ క్రీడల్లో పోటీలు నిర్వహించగా, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. - ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

చేనేతకు.. చేయూత

(5వ పేజీ తరువాయి)

కొనుగోళ్లు ఆపేశారని, ముడి సరుకులపై సబ్సిడీని నిలిపివేశారన్నారు. తాము వాటన్నింటినీ పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. చేనేత కార్మికుల ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ ఏడాది చేనేత పరిశ్రమ రూ.1,375 కోట్ల టర్నోవర్ సాధించిందని, చేనేతల ఆదాయం 30 శాతం పెరిగిందన్నారు. అయితే అది సరిపోదని ఆధునిక మార్కెట్‌ను సొంతం చేసుకునేలా నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలన్నారు. వినూత్న రీతుల్లో ఉత్పత్తులు తయారు చేయడం, మార్కెట్ సదుపాయాన్ని కల్పించడంపై చేనత సలహాదారుగా నియమితులైన పారిశ్రామికవేత్త సుచిత్ర ఎల్లా సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. లోకేశ్ నేతృత్వంలో నిర్వహిస్తున్న మంగళగిరిలో 'వీవర్‌శాల' ప్రయోగాత్మక నమూనా అన్నారు. టాటా, బిర్లా వంటి ప్రముఖ సంస్థలతో అనుసంధానం చేసుకుని చేనేత మార్కెట్ అవకాశాలను పెంచుకునే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే, రాష్ట్రమంతటా అమలు చేస్తామన్నారు. వన్ ప్రాజెక్ట్ వన్ డిస్ట్రిక్ట్ పథకంలో రాష్ట్రానికి తొమ్మిది అవార్డులు వస్తే అందులో 3 అవార్డులు చేనేతకే రావడం చేనేతకు దక్కిన అరుదైన గౌరవమన్నారు. అలాంటి చేనేతను సంరక్షించడమే తమ కర్తవ్యంగా భావిస్తున్నామని తెలిపారు. చేనేత వస్త్ర ఉత్పత్తులను ఈ కామర్స్ పద్ధతిలో ఓఎన్‌డీసీ ద్వారా అందరికీ అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ఇప్పటి వరకు 2వేల రకాల చేనేత ఉత్పత్తులు ఓఎన్‌డీసీ రిజిస్టర్ అయ్యాయని చెప్పారు. మంత్రి లోకేశ్ కోరినవిధంగా మంగళగిరిలో ప్రగడ కోటయ్య పార్కును ఏర్పాటు చేసి, అక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన జయంతిని అధికారికంగా నిర్వహిస్తామన్నారు. ప్రగడ కోటయ్య పేరుతో వెంకటగిరిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాండ్లూమ్ సంస్థకు ఆయన పేర నామకరణం చేశామన్నారు. రాష్ట్రంలోని 93 వేల చేనేత కుటుంబాల సంక్షేమానికి యాక్షన్‌ప్లాన్ తయారుచేసి దానిని త్రికరణశుద్ధిగా అమలుచేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

అన్నింటా ఒక అడుగు ముందున్న లోకేశ్..

మంగళగిరి నియోజకవర్గంలో 200 అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహణతోపాటు, 2 వేల పనులు పూర్తి చేసిన లోకేశ్ అందరికంటే ఒక అడుగు ముందున్నారని సీఎం కొనియాడారు. 5 వేల ఓట్లతో ఓడిన చోటే.. తిరిగి 91 వేల ఓట్లతో గెలిచారన్నారు. తనను గెలిపించిన ప్రజల జీవితాల మెరుగుదలకు లోకేశ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాష్ట్రంలో మంగళగిరిని నెంబర్ వన్‌గా చేయాలన్న ఆయన సంకల్పం కచ్చితంగా నెరవేరుతుందన్నారు.

అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

(5వ పేజీ తరువాయి)



విషజ్వరాల బారిన పడిన బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్

నెలకొన్నాయని ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచి దోమలనునివారించేందుకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేశామన్నారు.చెరుకుపల్లి గ్రామంలో రహదారి వెంబడి కొట్టేసిన కొబ్బరిబోండాలు అధికసంఖ్యలో కనబడటంతో అధికారులతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం ఎక్కడా లోపించకుండా ఆయా తహశీల్దార్లు, ఎంపీడీవోలు ప్రత్యక్షంగా తిరిగి చర్యలు చేపట్టాలని సూచించారు. నిజాంపట్నం మండలం ముత్తుపల్లి గ్రామం దళితవాడలో కలెక్టర్ పర్యటించారు. గ్రామంలో నమోదైన డెంగ్యూకేసు నేపథ్యంలో అధికారుల చర్యలపై ఆరాతీశారు. కాలనీలో పరిశుభ్రతను స్వయంగా పరిశీలించి అప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులతో బ్లీచింగ్ దోమల నివారణ మందు స్ప్రేచేయించారు.నగరం మండలంలో ప్రధాన రహదారి ప్రక్కనే చెత్తనిల్వపై పంచాయతీ సెక్రటరీని సస్పెండ్ చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చికిత్సపొందుతున్న జ్వరబాధితులను పరిశీలించారు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి గ్రామంలో పర్యటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. విషజ్వరాలను నివారించేందుకు చర్యలు చేపట్టామని వైద్యాధికారులకు అనుమానం ప్రతి గ్రామంలో ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈకార్యక్రమంలో నిజాంపట్నం ఇన్‌చార్జ్ తహశీల్ధార్ మోర్లశ్రీనివాసరావు, నగరంఎంపిడివో బొర్రాశ్రీను, వైద్యాధికారులు, పాల్గొన్నారు.

జిల్లాకు.. జ్వరమొచ్చింది

(5వ పేజీ తరువాయి)

ప్రజారోగ్యం విషయంలో తూతూ మంత్రంగా వ్యవహరించడం సరికాదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

వర్షాకాలం మొదలైంది

ఈ సీజన్‌లో అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇప్పుడు వెలుగు చూస్తున్న డెంగీ జ్వరాలు కూడా సీజన్ ఆరంభం ఫలితమే. వీటిని ఆదిలోనే కట్టడి చేయాలంటే గ్రామాలలో పారిశుధ్యం మెరుగుదలపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇంటిఇంటికి తిరిగి చెత్త సేకరణ, తాగునీటి విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. వీటికి తోడు మలేరియా నియంత్రణా విభాగం కూడా దోమల నివారణ చర్యలపై కార్యాచరణ రూపొందించుకుని ఆ దిశగా అడుగులేయాల్సి ఉంది. జనావాసాల్లో ఎక్కడా కూడా మురుగు కనబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అన్నింటికన్నా ముఖ్యంగా జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకునేలా ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సి ఉంది. గ్రామాల్లో ఫీవర్‌సర్వేని పకడ్బందీగా నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేయాలి. ఈ ప్రక్రియ అంతా కూడా యుద్ధ ప్రాతిపదికన గ్రామాల్లో జరగాలంటే ప్రభుత్వం రెండో విడత ఆర్థిక సంఘం నిధుల విడుదలకు మోక్షం కల్పించాలి. లేదంటే కేసులు నమోదైనప్పుడు హడావిడి తప్ప క్షేత్రస్థాయి ఫలితాలు చూపెట్టడంలో నిధుల కొరత సిబ్బందికి ప్రతికూలంగా మారే అవకాశాలు కనబడుతతున్నాయి. జిల్లాలో ఉన్న 459 పంచాయతీల్లో దాదాపు 400 చోట్ల గడచిన మూడు నెలలుగా దోమల మందు ఫాగింగ్ చేపట్టకపోవడమే నిధుల కొరతకు ఉదాహరణగా నిలుస్తోంది. 15 వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు నేటికీ పంచాయతీలకు జమ కాలేదు. జిల్లాలోని 459 పంచాయతీలకు గాను రూ.22 కోట్ల వరకు విడుదల కావాల్సి ఉంది. కానీ ప్రభుత్వం వైపు నుంచి కదలిక కనబడడం లేదు. గతేడాది నవంబరులో 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నిధులను ప్రభుత్వం పంచాయతీల ఖాతాలకు జమ చేయడంతో పాలక వర్గాలు కొంతమేర ఊపిరి పీల్చుకున్నాయి. మూడు నెలల క్రితమే రెండో విడత జమ కావాల్సి ఉన్నా ప్రభుత్వం తాత్సారం చేయడం వల్ల కనీస పనుల నిర్వహణకు కూడా పల్లె సీమలు నిధుల కటకట ఎదుర్కొంటున్నాయి.

రైల్వేశాఖలోని సమస్యలను పరిష్కరించాలి

- ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి ప్రశ్న

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలో చాలా కాలంగా రైల్వేశాఖలో అపరిష్కృతంగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీలు కోరారు. ఢిల్లీలో గురువారం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి సహచర పార్లమెంట్ సభ్యులతో కలిసి సమస్యలను వివరించారు. ఆం.ధ్రప్రదేశ్‌తో పాటు ప్రకాశం జిల్లాలో రైల్వేకు సంబంధించి అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించేలా చూడాలని వినతిపత్రం అం దజేశారు. ఆయా సమస్యలపై రైల్వేశాఖ మంత్రి సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారని మాగుంట తెలిపారు.

పొగాకును పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలి

- మాజీ మంత్రి మేరుగ

ఒంగోలు(రూరల్), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రైతులు వద్ద ఉన్న పొగాకును పూర్తిస్థాయిలో తక్షణమే కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని మాజీ మంత్రి మేరుగ నాగార్జున డిమాండ్ చేశారు. గురువారం ఒంగోలు పొగాకు బోర్డు వేలం కేంద్రం-2ను ఆయన వైసీపీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సం దర్భంగా నాగార్జున మాట్లాడుతూ బోర్డు ఛైర్మన్, బోర్డు ఈడీ వ్యాపారులతో కుమ్మక్కై రైతుల వద్ద నుంచి పొగాను అతి తక్కువ ధరలకు కొనుగోలు చే స్తున్నారని ఆరోపించారు. దీనికితోడు నోబిడ్‌లు చేయటంతో రైతులు అ ల్లాడుతున్నారని చెప్పారు. మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకును కొను గోలు చేయాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ ఒంగోలు నియోజక వర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, నాయకులు మారెళ్ల బంగారుబాబు, పోలవరపు శ్రీ మన్నారాయణ, మన్నె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

అన్నదమ్ముల పరస్పరం దాడులు

● ఇరువురికి తీవ్ర గాయాలు

ప్రసాద్‌నగర్(చీరాల), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తులకు సంబంధించి అన్నదమ్ముల మధ్య వివాదం తారాస్థాయికి చేరింది. స్థానిక ప్రసాద్‌నగర్‌కు చెందిన రాతికింద జాన్, యలమందలు అన్నదమ్ములు. వీరికి కొంతకాలంగా పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తుల విషయంలో గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో అదికాస్త ముదరడంతో గురువారం ఇరువురు కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. దీంతో ఇరువురు తలలకు తీవ్రరక్తగాయమైంది. దీంతో బంధువులు ఇరువురిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి



గర్భిణులు, బాలింతలకు పౌష్టికారం అందజేస్తున్న సీడీపీవో

చీరాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు విధిగా ఆరోగ్య సూత్రాలు పాటించాలని సీడీపీవో ఝాన్సీ పేర్కొన్నారు. ఈ నెల 1 నుండి ప్రారంభించిన తల్లిపాల వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సీడీపీవో ఆధ్వర్యంలో చీరాల ఏరియా వైద్యశాలలో బాలింతలకు రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు ప్రారంభదశ నుంచే ఆరోగ్య విధివిధానాలపై ప్రత్యేకదృష్టి సారించాలని సూచించారు. తద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కవిత, కుముద్వతి, తబిత, ఆరోగ్య సిబ్బంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

చీరాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లోని బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని మాజీ ఎంపీ చిమటా సాంబు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అక్కడి ప్రభుత్వం అదేతీరును వ్యవహరిస్తూ, చట్టసభల్లో బిల్లు ప్రవేశపెట్టి కేంద్రంపై ఒత్తిడి పెంచడం హర్షిందగిన అంశమన్నారు. ఏపీలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఈ తరహా కృషిచేసి బీసీలకు తోడ్పాటు అందించాలని కోరారు.

నేడు ఇంకొల్లుకు జిల్లా రవాణా అధికారి

ఇంకొల్లు,ఆగస్టు 7,(ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా రవాణా అధికారి డి.సామ్రాజ్యం శుక్రవారం ఇంకొల్లు పర్యటనకు రానున్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచితబస్సు సౌకర్యాల ఏర్పాట్లు చేసేందుకు పూర్తిస్థాయిలో సమాచారం తెలుసుకోవడం, సమస్యలను తెలుసుకొని పరిష్కరించే దిశగా ఆమె ఇంకొల్లు మండలంలో పర్యటించనున్నారు.

ఎంఈవో -2గా శ్రీనివాసరావుకు బాధ్యతలు

అద్దంకిటౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అద్దంకి మండల ఎంఈవో-2గా కేవీ శ్రీనివాసరావును నియమిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ బి.లింగేశ్వరరెడ్డి గురువారం ఆదేశాల జారీ చేశారు. కేవీ.శ్రీనివాసరావు చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్నారు.

పేదల వైద్యానికి భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం

విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్



చెక్కును అందజేస్తున్న విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): పేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి నియోజకవర్గంలోని పలు గ్రామాలలో వైద్యం చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న కార్యకర్తలను గురువారం మంత్రి రవికుమార్ పరామర్శించారు. అనంతరం సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం వద్ద మంత్రి అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంలో 16 మందికి వైద్య చికిత్సల కోసం సీఎంరిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.34 లక్షల విలువైన చెక్కులు, ఎల్‌ఓసీలను అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.400 కోట్లు పంపిణీ చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తోందన్నారు. ఇప్పటికే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేసినట్లు తెలిపారు. 15వ తేదీ నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

దొంగతనాలను నియంత్రించండి

అద్దంకి : దొంగతనాలు జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి రవికుమార్ అన్నారు. సంతమాగులూరు మండలం కుందుర్తిలో ఇటీవల వరుసగా రెండు చోరీలు చోటుచేసుకోగా, గురువారం వారు మంత్రి రవికుమార్‌ను కలిసి వివరించారు. ఈ సందర్భంగా చోరీలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంతమాగులూరు సీఐ వెంకట్రావుతో మంత్రి రవికుమార్ చర్చించారు. అదే సమయంలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కూడా పెద్దఎత్తున చోరీలు జరుగుతున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చోరీలకు పాల్పడే దొంగలను పట్టుకోవడంతో పాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లోని కాపర్ తీగ కొనుగోలు చేసే వ్యక్తులను గుర్తించి, వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ జరిగితే మరలా ఏర్పాటు చేసుకోవాలంటే రైతులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. చోరీలు జరగకుండా పోలీస్ అధికారులు అందరు కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. అదే సమయంలో రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు.

సామాజిక తనిఖీలో వెలుగులోకి అక్రమాలు

రూ.1.29 కోట్లు అవకతవకలకు పాల్పడినట్లు గుర్తింపు

బల్లికురవ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాలలో చేపట్టిన పనులకు సంబంధించి గురువారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన పనుల వివరాలను, జమా ఖర్చులను వివరించారు. డ్వామా పీడీ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో జరిగిన సభలో 2024-25 మధ్య రూ.12 కోట్లతో జరిగిన 645 పనులపై వినియోగించారు. ప్రజావేదిక సందర్భంగా గురువారం రాత్రి ఏడు గంటల సమయానికి 9 గ్రామాల ఆడిట్ పూర్తయ్యింది. ఇందుకు గాను రూ. 1.29 కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయని అధికారులు గుర్తించారు .అలానే మరో రూ.62 లక్షలతో చేసిన పనులకు తనిఖీ చేయాల్సి ఉంది. మిగిలిన 6 గ్రామాల ఆడిట్ కూడా పూర్తయితే మరిన్ని అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉంది. ఉప్పుమాగులూరు ముక్తేశ్వరం, నక్కబొక్కలపాడు, బల్లికురవ, మల్లాయపాలెం, అంబడిపూడి, వైదన గ్రామాలలో పనులు చేయ కుండానే నగదు డ్రా చేసినట్లు తనిఖీ బృందం గుర్తించింది. పనులకు కొలతలు లేకపోవటం ఫేక్ మస్టర్లు వేయటం, హార్టీకల్చర్ ద్వారా వేసిన మొక్కలు లేకపోవడం, ఒకే పనిని రెండు సార్లు చేయడం చేసిన పనులకు ఫొటోలు లేకపోవడం వంటి లోపాలు ఉన్నట్లు తనిఖీ బృందం గుర్తించింది. మల్లాయపాలెం గ్రామ మాజీ సర్పంచ్ మాట్లాడుతూ తమ గ్రామంలో పెద్ద ఎత్తున పనులలో అవకతవకలు జరిగాయన్నారు.



సిబ్బందిపై ఆగ్రహంవ్యక్తం చేస్తున్న పీడీ విజయలక్ష్మి

తన వద్ద అన్ని ఆధారాలున్నాయని ప్రజావేదికలో ఫిర్యాదు చేశారు.ప్రజావేదికలో హెచ్‌ఆర్ మేనేజర్ చంద్రశేఖర్ క్వాలిటీ అధికారి సతీష్, ఎస్ఆర్పీ తులసినాయక్, ఏపీడీ కోటయ్యానాయక్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో పాంగురంగస్వామి పాల్గొన్నారు.

ఉపాధి పనులలో ఈకేవైసీ నమోదు తప్పనిసరి

ఏపీవో సంతోషం

పంగులూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో పనిచేసే కూలీలకు ఈకేవైసీ నమోదు తప్పనిసరి అని ఏపీవో కె.సంతోషం అన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో కె.సుమంత్ అధ్యక్షతన గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 7వ తేదీ నుంచి ఉపాధిహామీ పథకంలో ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా పనుల నిర్వహణలో నూతన మార్గదర్శకాలు అమలుచేయాలని సూచించారు. పనులలో పాల్గొని ప్రతికూలి యాప్‌లో ముందుగా ఈకేవైసీ నమోదు చేయాలన్నారు. పనిచేసే ప్రదేశంలో కూలీల వేలిముద్రలు లేదా ఐరిష్ తీసుకోవడం ద్వారా హాజరు నమోదు అవుతుందన్నారు. క్షేత్ర సహాయకులు నూతన మార్గదర్శకాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో టీఏలు సురేష్, సుధాకర్, శ్రీను, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలి



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న రోటరీ క్లబ్ సభ్యులు, విద్యార్థులు

అద్దంకిటౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఆర్‌టీవో సీఐ ప్రసన్నకుమారి అన్నారు. గురువారం రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎం.త్రిమూర్తులు సౌజన్యంతో కళాశాల ఆవరణలో మొక్కలునాటే కార్యక్రమం నిర్వహించారు. మొక్కల పెంపకం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అనంతరం జీవనది గుండ్లకమ్మ పరిరక్షణ అనే అంశంపై జరిగిన వ్యసరచన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లాజరస్‌బాబు, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శివధర పూర్ణచంద్రరావు, హరిప్రసాద్, శ్రీనివాసరావు, దేవపాలన, చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, అంజాద్ బాషా, ప్రతాప్, వెంకటస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు అపరాల సాగువైపు మరలాలి



ట్రైకోడెర్మావిరిడి పంపిణీ చేస్తున్న ఏడీఏ

మేదరమెట్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు పొగాకు సాగును తగ్గించి శనగ, మినుము మొక్కజొన్న పంటల సాగువైపు మళ్లాలని ఏడీఏ బీ.ఎఫ్రాయిం అన్నారు. గురువారం కొరిశపాడు మండలంలోని కనగాలవారిపాలెంలో ఆత్మ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో వివిధ పంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఏడీఏ ఎఫ్రాయిం, బాపట్ల డాట్ శాస్త్రవేత ఆర్. బాలమురళీధర్‌నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ డబ్బులు పడని రైతులు వారి పొలం పాస్‌పుస్తకం, ఆధార్ కార్డుతో గ్రామంలోని వీఏఏని సంప్రదించి లోపాలను సరి చేసుకోవాలన్నారు. డాట్ శాస్త్రవేత ఆర్.బాలమురళీధర్ నాయక్ మాట్లాడుతూ పలు పంటలలో వచ్చే పురుగులు, చీడపీడల గురించి రైతులు అవగాహన కల్పించారు. రైతులు విత్తనశుద్ధి పాటించాలని, శనగలో ఎండుతెగులు నివారణకు 5 కిలోల ట్రైకోడెర్మావిరిడిని 50 కిలోల చివికిన నయ్యి మట్టిలో 10 రోజులు మాగబెట్టి 1 ఎకరంలో తేమ ఉన్న సమయంలో చల్లుకోవాలన్నారు. రైతులకు ట్రైకోడెర్మా విరిడిని అందజేశారు. కార్యక్రమంలో ఏవో రాంమోహన్‌రెడ్డి, బీటీఎం శేషారావు, ఏటీఎం రామిరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వీఏఏలు పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీపై డీడీఎంఎస్ విచారణ

బల్లికురవ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వీర్లకొండ వద్ద ప్రమాదం జరిగి కూలీలు మృతిచెందిన గ్రానైట్ క్వారీని మూడు జిల్లాల డిప్యూటీ డెరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారి జ్ఞానేశ్వర్ పరిశీలించారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించి నివేదికలను తయారు చేశారు. భద్రత పరంగా చేపటాల్సిన చర్యల గురించి సిబ్బందికి సూచనలు చేశారు. అన్ని గ్రానైట్ క్వారీల మేనేజర్లకు శిక్షణ ఇస్తామని ఈసందర్భంగా ఆయన తెలిపారు. ఈ పరిశీలనలో మైనింగ్ ఏజీ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి



గ్రాసాన్ని పరిశీలిస్తున్న డీపీఎం మోహన్

చినగంజాం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగ అడిషనల్ డీపీఎం మోహన్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కే.శారద అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయ సప్తసూత్రలపై గురవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీపీఎం మోహన్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రకృతి సేద్యం ద్వారా పండించిన ఆహారోత్పత్తులు తినడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. చినగంజాంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులుతో పండించిన గడ్డిని పరిశీలించి, మెజర్మెంట్స్‌ను తీసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం గద్దె పెదసుబ్బారావు, సీసీలు, వీవోఏలు, ప్రకృతి వ్యవసాయ డివిజన్ మాస్టర్ ట్రైనర్ భారతి, యూనిట్ ఇన్‌చార్జ్‌లు జయమ్మ, శ్రీలక్ష్మిలు పాల్గొన్నారు.

అటవీ భూములలోకి వస్తే చర్యలు

బల్లికురవ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఎవరైన ఫారెస్టు భూముల్లోకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కూకట్లపల్లి ఫారెస్టు బీట్ ఆఫీసర్ రమేష్ హెచ్చరించారు. గురువారం మండలంలోని ఉప్పుమాగులూరు ఫారెస్టు భూములను అయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొందరు రైతులు ముళ్లచెట్లను ఫారెస్టు భూములలోకి వేయడంతో రైతులతో అయన మాట్లాడారు. ఎవరైన తమ భూములలో చెట్లను కొట్టిన, మట్టిని తవ్విన చర్యలు తప్పవన్నారు. ఎస్ఎల్ గుడిపాడు గ్రామం వద్ద ఉన్న అటవీ భూమిని కూడా అయన పరిశీలించారు. కొందరు మట్టిని తవ్వుతున్నారని మట్టి తరలించే భూమి తమది కాదని ప్రభుత్వ భూమి అని అయన తెలిపారు.

విజయవంతంగా ముగిసిన ఏఐ వర్క్‌షాపు

చీరాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎడ్జ్ ఏఐ అండ్ యుఏవీ(డ్రోన్) టెక్నాలజీ వర్క్‌షాపు విజయవంతంగా ముగిసినట్లు సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. హైదరాబాద్ రామ్‌సిరి అగ్రి ఎల్‌ఎల్‌పీ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అవగాహన పొందారు. అందుకు సంబంధించి గురువారం ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డా.అనీల్‌కుమార్, డా.లక్ష్మీతులసీ, మనోజ్‌కుమార్, డా.సురేష్‌కుమార్, హరీష్, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ తల్లి మృతి

అద్దంకి, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): అత్త,మామలు ఇళ్లు ఖాళీ చేయాలని చెప్పడంతో మనస్తాపంతో తల్లి, కుమార్తెలు ఆత్మహత్యకు యత్నించిన ఘటనలో తల్లి కొల్లూరి శ్రావణి (35) మృతిచెందారు. పదవ తరగతి చదువుతున్న కుమార్తె శ్రీదేవి వైద్యశాలలో చికిత్స పొందుతోంది. పూర్ణయ్య, కోటమ్మలకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె కాగా అందరికి వివాహమైంది. అయితే పూర్ణయ్య, కోటమ్మలు అద్దె ఇంటిలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో కుమారుడు సుబ్బారావు, శ్రావణిలు ఉండే ఇళ్లు ఖాళీ చేసి అద్దె ఇంట్లోకి వెళితే తాము ఆ ఇంట్లో ఉంటామని ఒత్తిడి చేయడం ప్రారంభించారు. దీంతో సోమవారం శ్రావణి, కుమార్తెలు ఎలుకల మందు తిన్నారు. ఇది గమనించిన కుటుంబసభ్యులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం శ్రావణి మృతి చెందింది. శ్రావణికి భర్త సుబ్బారావు, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

దివ్యాంగునికి ఎలక్ట్రికల్ ట్రైసైకిల్ అందజేత



ఎలక్ట్రికల్ ట్రై సైకిల్ ను అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలపర్ల గ్రామంలోని దివ్యాంగుడైన తన్నీరు శివలక్ష్మణ్‌కు ఎలక్ట్రికల్ ట్రైసైకిల్‌ను గురువారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఆయన తండ్రి శ్రీనివాసరావుకు అందజేశారు. టీడీపీ నాయకులు కంభంపాటి హనుమంతరావు ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి తన్నీరు శ్రీనివాసరావు విషయాన్ని తీసుకువెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గ్రామ టీడీపీ నాయకుల సమక్షంలో కుమారునికి అందజేయాలి శ్రీనివాసరావుకు ఎలక్ట్రికల్ ట్రైసైకిల్ ను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బూరగవీరయ్య, యర్రా రమేష్, గంజి మణికంఠ, తన్నీరు శ్రీను, మాలపాటి రాఘవయ్య, బూరగ రమేష్, మూకిరి రమేష్, షేక్ రజాక్, కామినేని జనార్దన్, అడుసుమల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో బోరు ఏర్పాటు

● విద్యార్థుల కోరికను నెరవేర్చిన ఎమ్మెల్యే ఏలూరి



బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్

మార్టూరు, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలపర్ల గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో గురువారం బోరును ఏర్పాటు చేశారు. ఇటీవల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆ పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు హాజరయ్యారు. కార్యక్రమంలో కొంతమంది విద్యార్థులు హైస్కూల్‌లో మంచినీటి సమస్య ఉందని పరిష్కరించాని కోరారు. దీంతో స్పందించిన ఆయన గురువారం హైస్కూల్‌కు బోరును మంజూరుచేయగా, గ్రామ సర్పంచ్ తాళ్లూరి బ్రహ్మయ్య బోరు వేసేందుకు శంకుస్థాపన చేసి బోరును పూర్తి చేయించారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

దేవాలయ నిర్మాణానికి నిధుల మంజూరు



అసంపూర్తిగా ఉన్న దేవాలయం నిర్మాణ పనులు

అద్దంకి, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్ ముంపు గ్రామమైన పాత కొటికలపూడి పునరావాస కాలనీగా ఉన్న వేణుగోపాలపురంలో దేవాలయం నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం నుంచి రూ.1.39 కోట్లు మంజూరైనట్లు సర్పంచ్ పూనాటి విక్రమ్, మాజీ సర్పంచ్ కంచర్ల వెంకట్రావులు తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక కృషితో కాలనీలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఆంజనేయస్వామి, వేణుగోపాలస్వామి, గంగమ్మ, పోలేరమ్మ దేవాలయాల చుట్టూ ప్రహరీల నిర్మాణం, అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పిలిచి పనులు పూర్తి చేసే విషయమై గురువారం మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి వివరించగా వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. దీర్ఘకాలంగా నిలిచిపోయిన పనులు త్వరలో పూర్తయితే దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తల్లి పాలతో రోగనిరోధక శక్తి

చినగంజాం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాలు చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.సాయిశ్రీచరణ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎన్.సుమలతలు అన్నారు. 11వ ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా కొత్తపాలెం గ్రామ పంచాయతీ, మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అడవీధిపాలెం గ్రామంలో గర్భిణులు, తల్లులుకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈ నెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. తల్లిపాలు అమృతంతో సమానమని, పోతపాలుతో పెరిగిన పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుందని వైద్యాధికారి అన్నారు. గర్భిణులు, బాలింతలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలుండే ఆహారం తీసుకోవాలని సూచించారు. తల్లిపాల వలన ఉపయోగాలు తీసుకోవలసిన ఆహారం గురించి అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడవీధిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం. మాధవీలత, ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్టూరుకు చేరిన ఇస్కాన్ సభ్యుల పాదయాత్ర



యువకులకు భగవద్గీత ప్రతులను అందజేస్తున్న ఇస్కాన్ సభ్యులు

మార్టూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత ప్రచారాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఇస్కాన్ సభ్యులు చేస్తున్న పాదయాత్రలో భాగంగా గురువారం మార్టూరుకు యాత్ర చేరింది. అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం (ఇస్కాన్) సంపూర్ణ భారతదేశ యాత్రలో భాగంగా ద్వారక నుంచి యాత్ర బయలుదేరింది. దాదాపుగా 25 మందితో కూడిన సభ్యుల బృందానికి మార్టూరు ఎమ్మెల్యే కార్యాలయం ఆహ్వానం పలికింది. వారికి కావలసిన అన్నివసతులను వారు సమకూర్చారు. భక్తులకు సభ్యులు ప్రసాదాన్ని, తీర్థాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రచార బృందం గురువు ఆచార్య దాసు మాట్లాడుతూ తిరుపతి, చెన్నై, శ్రీరంగం, రామేశ్వరంధామ్, చివరగా కన్యాకుమారి వరకు పాదయాత్ర చేస్తామన్నారు. అక్కడ నుంచి కేరళ, కర్నాటక రాష్ట్రాలలో ప్రచారం నిర్వహిస్తామన్నారు. వారి బృందానికి ఆహ్వానం పలికిన వారిలో కొమ్మినేని నవ్యసాయి, అనిల్, వెంకట్, రమేష్, మణి,సంపత్ తదితరులు ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



మాదవ్‌ను కలిసిన ఇంకొల్లు నాయకులు

ఇంకొల్లు, ఆగస్టు7, (ఆంధ్రజ్యోతి) : బీజేపీలో సభ్యత్వం పెంచి పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ కోరారు. ఇంకొల్లు మండల బీజేపీ నాయకులు గురువారం మాధవన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. బాపట్ల జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు వెనిగండ్ల వెంకటేశ్వర్లు, ఇంకొల్లు మండల బీజేపీ అధ్యక్షుడు నల్లూరి సాహితీ, కొల్లూరి హరిబాబు, నాదెండ్ల పార్థసారధి, కార్యకర్తలు కలవగా మాధవన్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరినట్లు నాయకులు తెలిపారు.